


రాజమహేంద్రవరం డీఎల్‌పీవోగా నాగలత

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 15 : రాజమహేంద్రవరం డివిజనల్ పంచాయతీ అధికారిగా ఎం.నాగలత బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు డీఎల్‌పీవోగా పనిచేసిన జానా సత్యనారాయణ నరసాపురం డీఎల్‌పీవోగా బదిలీ అయ్యారు.ఈ మేరకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ పంచాయతీ రాజ్ బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. సత్యనారాయణ డీఎల్‌పీవోగా ఉంటూ ఇన్‌చార్జి డీజీపీవోగా విధులు నిర్వహించారు. నాగలత రెండు రోజుల్లో విధుల్లో చేరనున్నట్టు తెలుస్తుంది.



ఉద్యోగులతో.. బంతాట!



- కుదింపునకు రేషనలైజేషన్ ప్రకటన
- ఇంకా విడుదల కాని మార్గదర్శకాలు
- అయోమయంలో సిబ్బంది
- జిల్లాలో 3940 మంది ఉద్యోగులు
- ఇప్పటికే 1500 మంది కొరత
- అదనపు విధులతో సతమతం
- మరింత తగ్గించే ప్రకటనపై ఆందోళన
- ఎన్నికల వేళ సర్దుబాటుపై ఆక్రందన

కూర్చోమంటే కూర్చోవాలి.. నిలబడమంటే నిలబడాలి.. పనిచేయమంటే పనిచేయాలి.. కాదు కూడదంటే కుదరదు.. ఇదేదో ప్రైవేటు ఉద్యోగుల కోసం కాదండోయ్.. ప్రభుత్వ ఉద్యోగులే.. అదేనండి.. సీఎం జగన్ మానసపుత్రిక అంటారే సచివాలయ సిబ్బంది.. వారి గురించే ఇదంతా.. ప్రతి సచివాలయానికి 11 మందిని నియమించారు.. మేం చేశామని గొప్ప చెప్పుకున్నారు.. ప్రస్తుతం రేషన్‌లైజేషన్ అంటున్నారు.. మేం చెప్పిన చోటుకి వెళ్లాలని హుకుం జారీ చేస్తున్నారు.. ఒక్కో సచివా లయంలో 8 మందిని ఉంచి మిగిలిన ముగ్గురిని సర్దుబాటు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.. దీంతో సచివాలయ సిబ్బంది ఎన్నికల వేళ ఇదేం తీరంటూ తీవ్ర ఆందోళనలో ఉన్నారు..

సచివాలయాల్లో 11 కాదు.. 8 మందే

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)
సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌కి రోజులు దగ్గర పడుతున్న వేళ సచివాలయ సిబ్బంది సర్దుబాటును ప్రభుత్వం తెరపైకి తెచ్చింది. ఇప్పటికే సచివాలయ సిబ్బందిని అన్ని పనులకూ వాడేస్తున్నారు. వైసీపీ సమావేశాలకు జనాలను తరలించడం..చివరికి ఆడుదాం ఆంధ్రా ఆటలకు వీక్షకులు కొరవడడంతో వారిని తీసుకొచ్చే పనిని సచివాలయ సిబ్బందికే అప్పగించారు. జగన్ సభలకైతే చెప్పనవసరం లేదు. వారం ముందు నుంచే పాట్లు మొదలవుతాయి. ఆడుదాం ఆంధ్రా ఆటలను చూడడానికి జనాలను తీసు కురాకపోతే సస్పెండ్ చేస్తామంటూ ఏకంగా ఓ ఐఏఎస్ అధికారి ఆ చిరుద్యోగులపై బెదిరింపులకూ దిగారు.ఇలా జాబ్ చార్టు ప్రకారం నిర్వర్తించాల్సిన విధుల కంటే అదనపు భారం ఎక్కువగా ఉందని సచివాలయ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్న తరుణంలో రేషనలైజే షన్ (సర్దుబాటు) అంటూ వాళ్లను మరింత ఆవేదనలోకి పాలకులు నెట్టేశారు.ఆ పేరుతో సచివాలయంలోని సిబ్బంది తగ్గింపునకు శ్రీకారం చుట్టడంతో ఉద్యోగులు సతమతమవుతున్నారు.

బదిలీలపై ఏదీ స్పష్టత

బదిలీలపై స్పష్టతలేకపోవడంతో అయోమయానికి గురవుతున్నారు. ప్రకటనే తప్ప ఇప్పటి వరకూ ఎలాంటి మార్గదర్శకాలు విడుదల కాలేదు. వారు పనిచేస్తున్న పట్టణం, మండల పరిధిలో బదిలీలు ఉంటాయా? జిల్లాలు మారుస్తారా? భార్యభర్తలు ఒకే చోట లేదా దగ్గరలో పని చేస్తుంటే బదిలీల్లో ప్రాధాన్యం ఇస్తారా? అనారోగ్యాన్ని పరిగణనలోకి తీసుకుంటారా? ఇలా అనేక సందేహాలు సచివాలయాల సిబ్బంది బుర్రలో తిరుగుతున్నాయి. ఇప్పటికే మహిళా పోలీస్ విషయంలో సందిగ్ధం వీడలేదు. యూనిఫాం సర్వీసులకు కొన్ని నిబంధనలు ఉంటాయి. అవేవీ పట్టించుకోకుండా జగన్ ఇష్టానుసారం ఉద్యోగాల్లో నియమించడంతో సమస్య వచ్చిపడింది. వాళ్లకు యూనిఫాంను పోలీస్ శాఖ అభ్యంతర పెట్టడంతో వ్యవహారం కోర్టు మెట్లె క్కింది.ఈ చిక్కుముడులు వీడకుండానే రేషనలైజేషన్ అంటున్నారు. ఎక్కడికి ఏ ప్రాతిపదికన పంపిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే సచివాలయ సిబ్బంది ఎన్నికల విధుల్లో తలమునకలై ఉన్నారు. ఇప్పుడు మార్పులు చేస్తే ఇబ్బందులు తప్పకపోవచ్చు. ఎన్నికల దృష్ట్యా ప్రభుత్వం బదిలీలు చేస్తోందనే వాదన నడుస్తోంది. తమ కు అనుకూలమైన వాళ్లను 'కావాల్సిన చోటు'లో నియమించుకోడానికి ఇప్పటికే వైసీపీ నాయకులు రంగంలోకి దిగారని సమాచారం.దీంతో ఉద్యోగులు జెంబేలెత్తిపోతున్నారు. తిరుపతి ఉప ఎన్నికల విధుల్లో అక్రమాలు చేసిన పాపం రెండేళ్ల తర్వాత వెంటాడి ఏకంగా ఒక ఐఏఎస్ సస్పెన్షన్‌కి దారితీయడానికి గుర్తు చేసుకుంటు న్నారు. ఐఏఎస్ అంతటి అధికారి పరిస్థితే అలా అయితే తర్వాత ఇబ్బందులు ఎదురైతే తమను ఎవరు పట్టించుకుంటారనే ఆందోళన సచివాలయ ఉద్యోగుల్లో కనిపిస్తోంది.

ఎనిమిదికి తగ్గిన పదకొండు

ఒక సచివాలయంలో సంక్షేమ అభివృద్ధి కార్యదర్శి, వార్డు పరిపాలన కార్యదర్శి, విద్యాడేటా ప్రాసెసింగ్ కార్యదర్శి, మహిళ బలహీన వర్గాల భద్రత కార్యదర్శి(మహిళా పోలీస్), ఆరోగ్య కార్యదర్శి,ప్రణాళికా నియంత్రణ కార్యదర్శి, సదుపాయాల కార్యదర్శి, పారిశుధ్య పర్యా వరణ కార్యదర్శి, రెవెన్యూ కార్యదర్శి, ఇంధన కార్యదర్శి, అడ్మిన్ ఉంటారు. అయితే ఇప్పుడు సచివాలయానికి ఎనిమిది మంది చొప్పున ఉండేట్లు సర్దుబాటు చేస్తున్నారు. తక్కువగా ఉన్న చోటుకు 11 మంది ఉన్న సచివాలయం నుంచి సిబ్బందిని పంపించే ప్రక్రియ మొదలుపెట్టబో తున్నారు. 11 మంది ఉన్నా జగన్ చేప్పే పనులకు సిబ్బంది సరిపోని పరిస్థితి ఉంది. ఇప్పుడు రేషనలైజేషన్ పేరుతో మార్పులపై అనేక అనుమానాలు నెలకొన్నాయి.

జిల్లాలో 3933 మంది

జిల్లాలో మొత్తం 512 సచివాలయాల్లో పట్టణ ప్రాంతాల్లోని వార్డు సచివాలయాలు 119 ఉన్నాయి. మిగిలినవి గ్రామ సచివాలయాలు. వాటిలో మొత్తం సిబ్బంది 3940 మంది ఉన్నారు.మెటర్నిటీ, మెడికల్ తదితర కారణాలతో సెల వులో రోజూ 200 మంది వరకూ ఉంటారు. మిగతా 3700 మంది పనిభారం భరించాలి. వాస్త వానికి ప్రభుత్వం ముందు ప్రకటించిన సంఖ్య ప్రకారం చూస్తే జిల్లాలోని సచివాలయాల్లో సుమారు 5,500 మంది సిబ్బంది ఉం డాలి.కానీ ఇప్పటికే సుమారు 1500 మంది సిబ్బంది కొరత ఉన్నట్టు తెలుస్తోంది.ఈ పరిస్థితుల్లో 8 మంది ఉంటే చాలు అంటూ సిబ్బందిని మరింత కుదించే కార్యక్రమం చేపట్టబోతున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో సేవలు కొరవడే అవకాశం ఉంది.

ఇన్‌చార్జి ఎక్కడండీ?

దేశంలో ఎక్కడా లేని డిపార్టుమెంటును జగన్ జనం నెత్తిపై రుద్దారు. ఎక్కడా ఇలాంటి డిపార్టుమెంటు లేకపోవడంతో నిబంధనలనూ పక్కాగా రూపొందించాలి. కానీ ప్రచార ఆర్భాటం చేస్తున్న ప్రభుత్వం వాస్తవంలో వెనుకబడుతోంది. సచివాలయాలు తీసుకొచ్చిన తర్వాత గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా అధికారి పోస్టును సృష్టించారు.కానీ దానికి అధికారిని నియమించ కుండా డీఎల్‌డీవోలకు, డీఆర్‌డీఏ పీడీలకు అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు.గతంలో అభివృద్ధి విభాగానికి జాయింట్ కలెక్టర్ ఉండేవారు. ఆయన సచివాలయ బాధ్యతలూ చూసుకునే వారు.కానీ తర్వాత ఆ పోస్టును పట్టించుకోలేదు.పంచాయతీరాజ్‌లోని ఎంపీడీవోలకు పదోన్నతి ఇచ్చి డీఎల్‌డీవోలుగా నియమిస్తారు.ఆర్డీవో కంటే డీఎల్‌డీవోకి రెండు ఇంక్రిమెంట్లు ఎక్కువ. అంటే ఆర్డీవో కంటే డీఎల్‌డీవో(డివిజనల్ లెవెల్ డవలప్‌మెంట్ ఆఫీసర్) స్థాయి ఎక్కువ. వారిలో సీనియర్‌ని గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా అధికారిగా నియమించాలి. జిల్లాలో రెండు డివిజన్లకూ ఉన్న ఇద్దరు డీఎల్‌డీ వోలకు సచివాలయాల అదనపు బాధ్యత అప్పగించారు. ఇక సచివాలయాల శాఖ ఏ డిపార్టుమెంటు పరిధో ఇప్ప టికీ స్పష్టత లేదు.గ్రామాల్లో అయితే గ్రామీణాభివృద్ధి మంత్రి,పట్టణాల్లో పట్టణాభివృద్ధి మంత్రి కార్యక్రమాలకు హాజరవుతున్నారు. ఈ రుగ్మతలు తగ్గించకుండా ఎన్నికల వేళ సిబ్బందిని ఇబ్బంది పెట్టే కార్యక్రమం చేపట్టబోతున్నారు.



గోపాలపురంలో స్ట్రాంగ్ రూమ్ పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

ఎన్నికలకు ప్లానింగ్ ఉండాలి : కలెక్టర్

గోపాలపురం, ఫిబ్రవరి 15: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సామగ్రి పంపిణీకి సమగ్ర కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కే.మాధవీలత ఆదేశించారు. గోపాలపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఆశ్రమ బాలికల పాఠశాలలో నియోజకవర్గానికి ప్రతిపాదించిన పంపిణీ కేంద్రాన్ని, స్ట్రాంగ్ రూమ్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి శివజ్యోతి, ఇతర అధికారులతో కలిసి గురువారం పరిశీలించి మాట్లాడారు. ఎన్నికల నిర్వహణ, ఓటింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించే క్రమంలో ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. డాక్టర్ బీఆర్ అంబే డ్కర్ గురుకుల పాఠశాల నుంచి గోపాలపురం నియోజకవర్గంలోని 248 పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల మెటీరియల్ పంపిణీ చేస్తారన్నారు. ఆమె వెంట డిప్యూటీ తాహసీల్దార్ కృష్ణ,ప్రిన్సిపాల్ ఉమాదేవి ఉన్నారు.

రామయ్యకు కోటి శుభలేఖల యజ్ఞం

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 15 : లోకకల్యాణార్థం కోటి గోటి తలంబ్రాల దీక్షలో భాగంగా గురువారం పుష్కరాలరేవులో అయోధ్య రామయ్యకు కోటి శుభలేఖల యజ్ఞం, విశ్వశాంతి హోమం చేసినట్టు కల్యాణం అప్పారావు తెలిపారు.ఈ ఏడాది కోటి గోటి తలంబ్రాల సమర్పణలో భాగంగా గురువారం రాజమహేంద్రవరం గోదావరి పుష్కర్ ఘాట్ వద్ద కోటి తలంబ్రాలకు విశ్వశాంతి హారతి, కోటి వత్తులకు సీతారామ అష్టోత్తర శతనామ పూజ, అయోధ్య రామయ్య కోటి శుభలేఖలు యజ్ఞం ప్రారంభించారు. శ్రీరామ తత్వాన్ని ప్రచారం చేయడంలో భాగంగా 13 ఏళ్లుగా భద్రాచలం,ఏడేళ్లుగా అయోధ్య సీతారామచంద్ర మూర్తికి కోటి గోటి తలంబ్రాలు పంపిస్తున్నామని చెప్పారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాలొన్నారు.

నేటి నుంచి చందన యాత్ర మహోత్సవాలు

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 15 : కోరుకొండ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి క్షేత్రంలో చిన్నజీయర్ స్వామి మంగళశాసనములతో ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకూ వార్షిక చందన యాత్ర మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయని గురువారం ఆలయ ధర్మకర్తలు కాలెపు సూర్య సింహాచలం, అర్చకుడు అవసరాల శ్రీకిరణ్ స్వామి వెల్లడించారు. భక్తులు హాజరై స్వామిని దర్శించుకో వాలన్నారు. 21వ తేదీ బుధవారం ఉదయం 10 గంటల నుంచి శ్రీవారి ప్రసాదం,అన్నసమారాధన, సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం ద్వాద శారాధన,మహా పూర్ణాహుతితో ఉత్సవం పరిసమాప్తి అవుతుందన్నారు.

పది నిమిషాల్లో వస్తానని చెప్పి వెళ్లాడు..

16 రోజులైనా తిరిగిరాలేదు.. అమ్మమ్మ ఫిర్యాదు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు అమ్మమ్మను రోడ్డుపై వదిలేసి వెళ్లిపోవడంపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కొంతమూరుకు చెందిన జి.వెంకటేశ్ గత నెల 29న అమ్మమ్మను రాజమహేంద్రవరంలో బస్సు ఎక్కించడానికి బైక్‌పై తీసుకుని బయలుదేరాడు.అయితే దానవాయిపేట వచ్చేసరికి ఫోన్ రావడంతో ఆమెను అక్కడ దింపేసి పది నిమిషాల్లో వస్తానని వెళ్లిపోయాడు. చాలా సమయం ఎదురుచూసి ఆమె తిరిగి కొంతమూరు వెళ్లిపోయింది. మనవడు జి.వెంకటేశ్ గురువారం వరకూ తిరిగి రాకపోవడంతో కంగారు పడిన అమ్మమ్మ సత్యవతి పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేసింది.. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పుల్లారావు తెలిపారు.



ప్రాజెక్టు గురించి వివరిస్తున్న విద్యార్థులు

నేటి విద్యార్థులే.. రేపటి శాస్త్రవేత్తలు

జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో జేసీ తేజ్‌భరత్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులో రాణించడంతో పాటు సృజనాత్మకతకు పదునుపెట్టి భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఎంపీ భరత్‌రామ్, జేసీ తేజ్ భరత్ పిలుపునిచ్చారు. జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన(ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల)ను సీజీటీఎం ఉన్నత పాఠశాలలో గురువారం ప్రారంభించి మాట్లాడారు. శాస్త్ర విజ్ఞాన రంగంలో భారత్ ఎన్నో విజయాలను సాధిస్తూ ప్రపంచ దేశాలకు గట్టి పోటీ ఇస్తోందన్నారు. పాఠశాల స్థాయిలో రూపొందిస్తున్న ఆవిష్కరణలు భవిష్యత్తులో స్ఫూర్తినివ్వాలన్నారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యసాధనకు పట్టుదలతో సాధన చేస్తే విజయాలు వాటంతటవే దరిచేరతాయన్నారు.కార్యక్రమంలో డీఈవో కె.వాసుదేవరావు, డిప్యూటీ ఈవో ఈవీబీఎస్.నారాయణ, డీఐ ఎస్.దిలీప్ కుమార్, రూరల్ ఎంఈవో ఎ.దుర్గా తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ లోకేషన్ ఐడెంటిఫికేషన్..

ఎమర్జెన్సీ లోకేషన్ ఐడెంటిఫికేషన్ యాప్ ద్వారా దగ్గరలోని పోలీస్ స్టేషన్, పంచాయతీకి అలారం ద్వారా అత్యవసర సమయంలో హెచ్చరికలు పంపించే పరికరాన్ని దేవరపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థి ఎం.సాయిరాం కృష్ణ తయారు చేశాడు. మహిళలు ప్రమాదంలో ఉన్న సందర్భంగా యాప్ ద్వారా సందేశం పంపించవచ్చని, జీపీఎస్‌తో అనుసంధానం చేయడం వల్ల బాధితులు ఎక్కడ ఉన్నారో తేలిగ్గా తెలుస్తుందని కృష్ణ చెప్పాడు.

టూ స్ట్రోక్ పవర్ స్ప్రేయర్

వ్యవసాయరంగంలో ఉపయోగపడే టూస్ట్రోక్ పవర్ స్ప్రేయర్ ని పీరా రామచంద్రాపురం స్కూల్ విద్యార్థిని సిద్ధాబత్తుల మధుబాల ఆవిష్కరించింది.ఈ స్ప్రేయర్‌తో ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేసుకోవచ్చని.. రైతులకు వెన్నునొప్పి వంటివి రాకుండా ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని మధుబాల తెలిపింది.

బయో ప్లాస్టిక్ తయారీ విధానం..

పర్యావరణ హానికరమైన ప్లాస్టిక్ వ్యర్థాలకు చెక్ పెట్టే దిశగా బయో ప్లాస్టిక్ తయారీ విధానాన్ని మల్లవరం జెడ్పీ హైస్కూలు విద్యార్థిని కె.పాలినా వివరించింది. కర్రపెండలం పిండి, గ్లిజరిన్, వెనిగర్, ఫుడ్ కలర్ ఉపయోగించి బయో ప్లాస్టిక్ తయారు చేసుకోవచ్చని పేర్కొంది.



విద్యార్థులు ఆవిష్కరించిన ప్రాజెక్టు పరిశీలిస్తున్న జేసీ తేజ్ భరత్, మేడపాటి షర్మిలారెడ్డి తదితరులు



రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల ఎదుట ఉద్యోగుల నిరసన ప్రదర్శన

ప్రభుత్వానికి తగిన శాస్తి చేస్తాం

రెండో రోజు అదే జోరు - నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి)/ రాజమహేంద్రవరం అర్బన్/ధవళేశ్వరం : సర్కారుపై ఉద్యోగులు యుద్ధం ప్రకటించారు.. డిమాండ్ల సాధనకు రోడ్డెక్కుతున్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక,పెన్షనర్ల ఐక్యకార్యాచరణ సమితి (ఏపీ జేఏసీ) ఇచ్చిన పిలుపుతో ఉద్యోగులు, ఉపాధ్యాయుల నిరసనలు జోరందుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లోనూ రెండో రోజు గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలిపారు. భోజన విరామ సమయంలో అందరూ బయటకు వచ్చి తమ జేఏసీ బ్యానర్ ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏపీ జేఏసీ కన్వీనర్ సేవా ప్రవీణ్‌కుమార్ మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు పరిష్కారం విషయంలో కపట ప్రేమను ప్రదర్శిస్తుందని, ఉద్యోగుల పట్ల చిత్తశుద్ధి చూపడం లేదన్నారు. ఈ ప్రభుత్వానికి ఉద్యోగులు తగిన శాస్తి చేస్తారన్నారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలని,పేరుకు పోయిన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. తక్షణమే మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని ఆర్అండ్‌బీ కార్యాలయం, పోస్ట్ కార్యాలయం, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎదుట నినాదాలు చేశారు. ధవళేశ్వరంలో జేఏసీ కన్వీనర్ ఎస్.జైకుమార్ , జిల్లా ఉపాధ్యక్షుడు పాలిక రాజబాబు ఆధ్వర్యంలో ఉద్యోగులు ఇరిగేషన్ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ వద్ద నిరసన చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న అన్ని డీఏ ఏరియర్స్ విడుదల చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఉద్యోగుల హక్కులు, పెండింగ్ బకాయిలు సాధించే వరకు ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో సంఘం ఉపాధ్య క్షుడు ఎం.మాధవరావు, ప్రతాప్, ఆనంద్, నాగశ్రీనివాస్, 4వ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర రావు, ఏపీ డ్రైవర్ల సంఘం నాయకులు టీవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, కార్యదర్శి వెంకటరమణ, ,.క్లాస్4 ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆలిండియా ఉపాధ్యక్షుడు వి.వెంకటేశ్వర్లు, బి.లక్ష్మణుడు,పీఎస్ శేషుకుమార్, ఎం.సతీష్, ఎస్కే సయ్యద్ బాజీ, ఎస్.వాసుదేవి, డి.కృపారావు,రామభద్రరావు పాల్గొన్నారు.



ధవళేశ్వరంలో ఇరిగేషన్ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ వద్ద ఉద్యోగుల నిరసన



అనుమానం.. పెనుభూతమై

- పచ్చనికుటుంబంలో చిచ్చు
- భార్యను హత్య చేసి..
- భర్త ఆత్మహత్య

7

పేదల గూడుకు టీడీపీ పోరు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 15: ప్రభుత్వం ఇళ్లు.. ఇళ్ళ స్థలాలు ఇస్తామని నమ్మించి ఎప్పటికప్పుడు మోసం చేస్తోందని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన రాజమహేంద్రవరం ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ అన్నారు. పేదల ఇళ్ళ కోసం తెలుగుదేశం ,జనసేన పార్టీల ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేశారు. వెలుగుబంద, బూరుగుపూడి ప్రాంతాల్లో జగనన్నకాలనీలు నివాసయోగ్యం కాదన్నారు. అయినా వైసీపీ ప్రభుత్వం ప్రస్తుతం రిజిస్ట్రేషన్ల పేరుతో నాటకాలు ఆడుతుందన్నారు. కోర్టు అనుమతిచ్చినా ఇప్పటి వరకు బూరుగుపూడిలో ఆవ భూములు ఎందుకు పంపిణీ చేయలేదని ప్రశ్నించారు. ఆ భూములు ప్రజలకు పంపిణీ చేస్తే మొదటికే మోసం వస్తుందని భయపడి కాలయాపన చేస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో గృహాలను శిధిలస్థితికి చేర్చిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అనంతరం కార్పొరేషన్ అదనపు కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, నగర అధ్యక్షుడు రెడ్డిమణి, మజ్జి రాంబాబు, బుడ్డిగ రాధ, ఉప్పులూరి జానకి రామయ్య, మొకమాటి సత్యనారాయణ, కడలి రామకృష్ణ, కరగాని వేణు, మాలే విజయలక్ష్మి, తురకల నిర్మల, అగురుధనరాజు, బేసరి చిన్ని, చాపల చిన్నరాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదరహిత డ్రైవర్లను సత్కరిస్తున్న ప్రత్యూషకుమారి

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూషకుమారి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 15 : ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలు నివారించాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రత్యూషకుమారి అన్నారు. రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో గ్యారేజీలో గురువారం జరిగిన రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు సభలో ఆమె మాట్లాడారు. వాహనం నడిపే సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎంవీఐ సంపత్‌కుమార్ మాట్లాడుతూ ప్రమాదాలు జరగడానికి కారణాలు, ట్రాఫిక్ రూల్స్ గురించి వివరించారు. ఆర్టీసీ జిల్లా అధికారిణి కె.షర్మిల అశోక మాట్లాడుతూ జిల్లాలోని రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, గోకవరం డిపోలకు సంబంధించి 15 మంది ప్రమాదరహిత డ్రైవర్లను ఎంపి చేశామన్నారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. ప్రమాదరహిత డ్రైవర్లను కుటుంబసభ్యులతో సహా సత్కరించారు. జిల్లావ్యాప్తంగా ఆయా డిపోల పరిధిలో పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో నాలుగు డిపోల మేనేజర్లు పాల్గొన్నారు.

ఎన్నికలకు సన్నద్ధం కండి : డీఐజీ

రేషన్ డీలర్ల కోసమే యాత్ర

7

సంఘం జిల్లా అధ్యక్షుడిగా జామి కృష్ణ ఎన్నిక



రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయం వద్ద పేదల స్థలాల కోసం ధర్నా చేస్తున్న టీడీపీ నాయకులు

నేటి నుంచి అంతర్వేది ఉత్సవాలు

పది రోజుల పాటు వైభవంగా ఉత్సవాల పర్వం

సర్వం సిద్ధం చేసిన అధికారులు

వివిధ వాహన సేవలకు ఏర్పాట్లు



అంతర్వేది, ఫిబ్రవరి 15: అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వార్షిక కల్యాణోత్సవాలు 16వ తేదీ శుక్రవారం రథసప్తమి పర్వదినాన ప్రారంభంకానున్నాయి. శుక్రవారం నుంచి పది రోజుల పాటు స్వామివారి కల్యాణ మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా అంతర్వేది చెరువులో హంసవాహనంపై స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

అంతర్వేదికి మార్గం:

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల నుంచి అంతర్వేది చేరుకునే భక్తులు రావులపాలెం, రాజోలు మీదుగా రావాల్సి ఉంటుంది. పశ్చిమగోదావరి జిల్లా నుంచి వచ్చే భక్తులు పాలకొల్లు, దిండి-చించినాడ వంతెన మీదుగా శివకోడు, మలికిపురం మీదుగా రావచ్చు.

పెంచిన ఆర్టీసీ బస్సులు:

లక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణోత్సవాల సందర్భంగా ఆర్టీసీ అమలాపురం, రాజోలు, రాజమహేంద్రవరం, కాకినాడ, భీమవరం, పాలకొల్లు డిపోల నుంచి 120 ప్రత్యేక బస్సులను నడుపుతోంది. అదే విధంగా గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం అదనపు బస్సులను కల్యాణోత్సవాలకు సిద్ధం చేశామని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

అంతర్వేది చేరుకోవాలంటే..

అంతర్వేదికి రాజోలు నుంచి 31 కిలోమీటర్లు, రాజమహేంద్రవరం నుంచి 104, అమలాపురం నుంచి 63, కాకినాడ నుంచి 118 కిలోమీటర్లు, పాలకొల్లు నుంచి 41 కిలోమీటర్లు, భీమవరం నుంచి 64 కిలోమీటర్లు.

నేటి వాహన సేవలు

కల్యాణోత్సవాల్లో తొలిరోజైన శుక్రవారం రథసప్తమినాడు స్వామివారికి సూర్యవాహనంపై ఊరేగింపు జరుగుతుంది. సూర్యుడు వెలుగునిచ్చే జ్ఞాన ప్రదాత. మనుషుల్లో అజ్ఞానాన్ని పారద్రోలి జ్ఞానం అనే వెలుగును నింపేందుకు కోటి సూర్యప్రభా సమేతుడైన శ్రీలక్ష్మీనరసింహస్వామి సాయంత్రం 4.30గంటలకు సూర్య ప్రభా వాహనంపై గ్రామ మాఢ వీధుల్లో ఊరేగుతారు. ముద్రికాలంకరణ అనంతరం స్వామివారు రాత్రి 8 గంటలకు చంద్ర ప్రభ వాహనంపై ఊరేగుతారు.



స్వామివారి రథం

నేడు స్వామివారు పెండ్లికొడుకాయనే

కేశవదాసుపాలెం వాస్తవ్యులు బెల్లంకొండ, ఉండపల్లి వారి కుటుంబీకులు సంయుక్త నిర్వహణలో శుక్రవారం ఉదయం నుంచి అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామికి అభిషేకాలు నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహిస్తారు. బెల్లంకొండ, ఉండపల్లి వారి కుటుంబీకులచే స్వామివారికి మధుపర్కములు సమర్పించి శుక్రవారం సాయంత్రం 6.30కు స్వామివారిని పెండ్లికుమారుడు, అమ్మవారిని పెండ్లి కుమార్తెను చేస్తారు. లక్షల సంఖ్యలో భక్తులు విచ్చేస్తారని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

సునామీపై మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న దృశ్యం



యానాం, ఫిబ్రవరి 15: సునామీ వస్తే ప్రభుత్వ యంత్రాంగం ఎలా అప్రమత్తమవ్వాలి, ముంపు ప్రాంతాల ప్రజలను ఎలా రక్షించాలనే అంశంపై పుదుచ్చేరి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శాఖ ఉత్తర్వులు మేరకు యానాంలో గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. స్థానిక రాజీవ్‌నగర్, దరియాతిప్ప ఏటిగట్టు మార్గంలోని ఏవీఆర్ కెమికల్స్ పరిశ్రమ, రాజీవ్ రివర్ బీచ్, జెట్టి తదితర ప్రాంతాల్లో ఈ డ్రిల్ నిర్వహించారు. తొలుత అధికారులు సైరన్లు మోగించుకుంటూ సునామీ హెచ్చరికలు చేశారు. స్థానిక ఇందిరా గాంధీ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి రక్షణ చర్యలను పరిపాలనాధికారి మునిస్వామి, ఇతర శాఖల అధికారులు పర్యవేక్షించారు. పలు పాఠశాలలు, ఆస్పత్రుల్లో వైద్య చికిత్సలు, పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, డిప్యూటీ తహసీల్దారు దండాయుధపాణి, విద్యుత్ శాఖ ఏఈ లంక కృష్ణారావు, వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం



దాతలకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న అధికారులు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 15: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి తూర్పు గోదావరి జిల్లా రాజానగరానికి చెందిన మందవిల్లి వెంకటేశ్వరరావు-కాశీఅన్నపూర్ణ దంపతులు రూ.5,05,116 విరాళం సమర్పించారు. వారికి ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో బి.కిశోర్‌కుమార్ స్వామివారి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, మన్యం భాను పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా గురువారం ఒక్కరోజు ఆదాయం రూ.1,63,990 లభించినట్టు ఈవో తెలిపారు.

భీమేశ్వరుని హుండీ ఆదాయం రూ.15.77 లక్షలు

ద్రాక్షారామ, ఫిబ్రవరి15: ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారికి హుండీ ద్వారా రూ.15,77,588 ఆదాయం సమకూరింది. గురువారం స్వామివారి హుండీలను దేవదాయశాఖ తనిఖీదారు బాలాజీరామ్ ప్రసాద్ పర్యవేక్షణలో ఈవో పి.టి.వి సత్యనారాయణ, సిబ్బంది హుండీలను తెరిచి లెక్కించారు. 2023 డిసెంబరు 14 నుంచి గురువారం వరకు ఈ ఆదాయం లభించినట్లు ఈవో పి.టి.వి సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో వాడ్రేవు సుందర రత్నాకరరావు, కంచర్ల చక్రి, సేవకులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి తాటిపర్తిలో నాటక పోటీలు

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 15: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో మార్కండేయ నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి 17వ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు జరగనున్నాయి. అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణా కళా వేదికపై 16,17,18వ తేదీల్లో ఈ పోటీలను నిర్వహించనున్నారు. తొలి రోజు శుక్రవారం గుంటూరు అమరావతి ఆర్ట్స్ కళాకారులు అమృతహస్తం నాటికను, విజయవాడ కళానిలయం కళాకారులు బంధం నాటికను ప్రదర్శిస్తారు. 17వ తేదీన గుంటూరు అభినయ ఆర్ట్స్ కళాకారులు ఇంద్రప్రస్థం, కొలకలూరు సాయి ఆర్ట్స్ కళాకారులు కౌసల్య సుప్రజ రామా, అమలాపురం రసవాహిన కళాకారులు స్వీకారం నాటికలను, 18వ తేదీన తాడేపల్లి అరవింద ఆర్ట్స్ కళాకారులు స్వర్గానికి వంతెన, కొప్పోలు పండు క్రియేషన్స్ కళాకారులు పక్కింటి మొగుడు నాటికలు ప్రదర్శించనున్నారు. కళాభిమానులు ఈ నాటికలను తిలకించేందుకు రావాలని మార్కండేయ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు పడాల రవి కోరారు.

20న జనార్ధనస్వామి రథోత్సవం

ధవళేశ్వరం, ఫిబ్రవరి 15: పురాణ ప్రసిద్ధిగాంచిన జనార్ధన స్వామి రథోత్సవం, కల్యాణోత్సవాలను ఐదు రోజులపాటు నిర్వహించడానికి ఆలయాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకూ నిర్వహించే రథోత్సవానికి ఆలయ ప్రాంగణాన్ని రంగులతో తీర్చిదిద్దుతున్నారు. మెట్ల మార్గం నుంచి రామపాదాల రేవు వరకు చలువ పందిళ్లు వేస్తున్నారు. రథసప్తమి సందర్భంగా రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించి తూర్పువైపునకు తిప్పి సిద్ధం చేస్తారు. రథోత్సవం సందర్భంగా పోలీస్‌స్టేషన్ సమీపంలోని ముఖ ద్వారాన్ని అగస్త్యేశ్వర ఆలయ చైర్మన్ పందెళ్ళ భానుప్రసాద్ ఆధ్వర్యంలో అందంగా తీర్చిదిద్ది ఆలయ పేర్లతో అలంకరించారు.

అనుమానం పెనుభూతమై..

భార్యను హతమార్చిన భర్త

ఆపై తానూ పురుగుమందు తాగి ఆత్మహత్య

రోడ్డున పడ్డ చిన్నారులు

కడియపుసావరంలో విషాదం



కడియం, ఫిబ్రవరి 15: భార్యపై అనుమానం.. ఓ కుటుంబాన్ని చిందర వందర చేసింది. భార్యపై అనుమానం పెంచుకున్న భర్త ఆమెను హతమార్చాడు.. ఆపై తానూ పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. క్షణికావేశంలో జరిగిన ఈ ఘటనతో పిల్లలు అనాథలుగా మిగిలారు. కడియం మండలం కడియపుసావరం గ్రామంలోని వడ్డి వీరభద్రరావు కాలనీకి చెందిన దూళ్ళ సూరిబాబు(40)కు, అదే గ్రామానికి చెందిన సత్యశ్రీ(33)కి 16 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఎనిమిదో తరగతి చదువుతున్న కుమారుడు వెంకన్నబాబు, ఐదో తరగతి చదువుతున్న కుమార్తె వైష్ణవిశ్రీ ఉన్నారు. సూరిబాబు కౌలు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరు గతంలో వడ్డి వీరభద్రరావు కాలనీలో ఉండేవారు. ఇటీవల పంచాయతీ కార్యాలయం సమీపంలో సత్యశ్రీ తల్లిదండ్రుల ఇంటి వద్ద ఉంటున్నారు. భార్యపై అనుమానం పెంచుకున్న సూరిబాబు గురువారం ఉదయం భార్యతో గొడవపడి క్షణికావేశంలో పీకను పదునైన వస్తువుతో కోసాడు. దక్షిణ మండల డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, కడియం సీఐ బి.తులసీధర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని సత్యశ్రీ మృతదేహాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం ఆధారంగా వివరాలు సేకరిస్తున్నారు. క్షణికావేశంలో చేసిన తప్పుకు మనస్తాపం చెందిన సూరిబాబు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలియడంతో బంధువులు, గ్రామస్థులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సూరిబాబు సాయంత్రం మృతి చెందాడు. భార్యాభర్తల మృతితో పిల్లలిద్దరూ అనాథలుగా మిగిలారు.

పోలీసులకు ఫిర్యాదు

ఈ ఘటనపై కొవ్వూరులో ఉంటున్న సత్యశ్రీ సోదరి సంతోషి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తమ తల్లిదండ్రులకు తాము ఐదుగురు సంతానమని, ఏడాది క్రితం తల్లి చనిపోయిందని తెలిపింది. ఈ ఏడాది సంక్రాంతి పండుగకు సత్యశ్రీ ఎవరితోనో ఫోనులో మాట్లాడుతున్నట్టు సూరిబాబు తమకు చెప్పాడని, దీంతో పెద్దల సమక్షంలో వారికి నచ్చచెప్పినట్టు చెప్పింది. సత్యశ్రీని బావ పలు మార్లు వేధించాడని ఫిర్యాదులో పేర్కొంది. ఈనెల 14న సావరం గ్రామ పెద్దలు వచ్చి అక్కబావలకు సర్ది చెప్పారని తెలిపింది. ఈనెల 15వ తేదీ ఉదయం 6 గంటల సమయంలో తమ పుట్టింటిలో అద్దెకు ఉండే వాళ్లు సమాచారం ఇవ్వడంతో వచ్చామని, అప్పటికే సత్యశ్రీ(33) రక్తపు మడుగులో ఉందని, పీకపై లోతుగా తెగిన గాయం ఉందని, మొక్కల గ్రాఫ్టింగ్‌కు వాడే బ్లేడ్‌తో దాడిచేసి ఉండొచ్చని సంతోషి ఫిర్యాదులో పేర్కొంది.



సూరిబాబు, సత్యశ్రీ కుటుంబం

చెడు వ్యసనాలకు బానిసై దొంగతనాలు

నలుగురు బైక్ దొంగల అరెస్టు

17 వాహనాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

రామచంద్రపురం, ఫిబ్రవరి 15: చెడు వ్యసనాలుకు బానిసలై మోటారు సైకిళ్లను చాకచక్యంగా దొంగిలిస్తున్న నలుగురు బైక్ దొంగలను అరెస్టు చేసి వారి నుంచి 10 స్కూటీలు, 7 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్టు రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ తెలిపారు. రామచంద్రపురం పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడుతూ పట్టణంలో చర్చి కాం పౌండ్ వద్ద బైక్ దొంగతనం జరిగిందన్న ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టి పలు ప్రాంతాలలో వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న నలుగురిని అరెస్టు చేశామన్నారు. వారిని విచారించగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు ప్రాంతాలలో అలాగే యానాం పరిధిలో 17 వాహనాలను దొంగిలించినట్లు తెలిపారన్నారు. అరెస్టైన వారిలో రామచంద్రపురం సాయినగర్‌కు చెందిన సలాది ఉదయ్ సాయి సుధీర్, పెమ్మిరెడ్డి బాలవెంకట్, కుమ్మర్లవీధికి చెందిన అమలదాసు నాగబాబు, మండపేట మండలం చిన్న ద్వారపూడి గ్రామానికి చెందిన కొప్పిశెట్టి దిలీప్ ఉన్నారన్నారు. చెడు వ్యసనాలకు బానిసలైన వారు సులువుగా డబ్బులు సంపాదించడానికి ఈ మార్గాన్ని ఎంచుకున్నారన్నారు. తాళం వేసి ఉన్న మోటారు బైక్ వైర్లను కలిపి స్టార్ట్ చేసి దొంగిలిస్తున్నట్లు నిందితులు తెలిపారని చెప్పారు. పట్టణంలో ఎవరైనా ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు పోలీసు స్టేషన్‌కు ముందస్తు సమాచారం అందజేస్తే వారి ఇళ్లకు భద్రత కల్పిస్తామని చెప్పారు. కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ దొరరాజును, ఎస్ఐ కె.సురేష్‌బాబు, హెడ్ కానిస్టేబుల్ కె.వీరబాబు, ఎస్.ఈశ్వర్‌రావు, కానిస్టేబుల్స్ టి. సూరిబాబు, ఇ.అనిల్ కుమార్, పోలయ్య, కె.లోవరాజును డీఎస్పీ రామకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రభుత్వం నిర్లక్ష్యం

వైసీపీ హయాంలో 150 మంది సర్పంచ్‌లు

ఆత్మహత్యలు చేసుకున్నారు

తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్

గౌరవ అధ్యక్షుడు పుసులూరి నరేందర్



నరేందర్‌కి జ్ఞాపికను అందిస్తున్న సర్పంచ్‌లు

అంబాజీపేట, ఫిబ్రవరి 15: దేశానికే పట్టుకొమ్ములుగా ఉన్న గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ గౌరవ అధ్యక్షుడు పుసులూరి నరేందర్ అన్నారు. టీడీపీ హయాంలో సర్పంచ్ చేసిన పనులకు నిధులు మంజూరు చేయకుండా అడ్డువేయడంతో పలువురు ఆత్మహత్యలకు పాల్పడ్డారని చెప్పారు. మాచవరం పంచాయతీ కార్యాలయం వద్ద ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతకుమారి ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రజలకు అన్ని కష్టాలే అని అన్నారు. వలంటరీ వ్యవస్థను సీఎం జగన్ ఏర్పాటు చేసి పంచాయతీలను నిర్వీర్యం చేశారన్నారు. టీడీపీ హయాంలో ఎస్సీఎస్టీ, బీసీ సర్పంచ్‌లు కోట్లాది రూపాయలు వెచ్చించి గ్రామాల అభివృద్ధికి అనేక నిధులు ఖర్చుచేశారని, వాటిని ఈ ప్రభుత్వం వచ్చాక మంజూరు చేయకుండా ఆ సర్పంచ్‌లను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. దీంతో రాష్ట్రంలో ఉన్న సుమారు 150 మందికి పైగా సర్పంచ్‌లు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. సర్పంచ్‌ల హక్కుల సాధన కోసం దేశవ్యాప్త ఉద్యమాన్ని ప్రారంభించేందుకు ఏపీ ఛాంబర్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో త్వరలో కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థను జగన్ చిన్నాభిన్నం చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు జమచేసిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులను జగన్ ప్రభుత్వం దొంగలించిందని ఆరోపించారు. ఆర్థిక సంఘం నిధులు తిరిగి పంచాయతీలకు జమ చేసే విధంగా కోర్టును ఆశ్రయిస్తామన్నారు. రాష్ట్రంలో సుమారు 60 శాతం పైగా ఎస్సీఎస్టీ, బీసీ సర్పంచ్‌లు ఉన్నారని, వారిలో పొట్టకూటి కోసం కొందరు కూలి పనికి కూడా వెళుతున్నారన్నారు.సర్పంచ్‌లకు పంచాయతీల ద్వారా రూ.15 వేల నుంచి 20వేలకు పైగా గౌరవ వేతనం తీసుకునే విధంగా ప్రభుత్వం జీవో విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏపీ సర్పంచ్‌ల చాంబర్ కార్యదర్శి జల్లి బాలరాజు, సర్పంచ్‌లు చిక్కం జంగమయ్య (పెదబాబు), పెద్దిరెడ్డి రాము, అడబాల తాతకాపు, కుంపట్ల ఆదిలక్ష్మి నాయకులు కొప్పినీడి ఈశ్వరరావు ఉన్నారు.

తిరుమల విద్యాసంస్థల నూతన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న తిరుమలరావు

తుని రూరల్, ఫిబ్రవరి 15: తిరుమల విద్యా సంస్థలు రాజమహేంద్రవరం వారి నూతన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసును గురువారం పాయకరావుపేట మెయిన్ రోడ్డులో గల డీసీసీ బ్యాంక్‌పై తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విలువలతో కూడిన విద్యను అందరికీ అందించాలనే సదుద్దేశ్యంతో తిరుమల విద్యాసంస్థను నెలకొల్పామన్నారు. పాయకరావుపేట, తుని చుట్టుపక్కల గల పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు కోరిన మేరకు పాయకరావుపేట పీఎల్‌పురం సెంటర్ హైవే పక్కన తమ క్యాంపస్‌ను ప్రారంభిస్తున్నామన్నారు. ఈ క్యాంపస్ ఎల్‌కేజీ నుంచి తొమ్మిదో తరగతి, జూనియర్ ఇంటర్ డే స్కాలర్‌గా ప్రారంభించామన్నారు. పాయకరావుపేట, తుని, అన్నవరం చుట్టుపక్కల గ్రామాలకు బస్సు సౌకర్యం ఉందని, అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని చెప్పారు. అడ్మిషన్లు, ఇతర వివరాలు కోసం 80084 78777, 85209 26777 నంబర్‌లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమల డైరెక్టర్ నున్న సరోజినీదేవి, అకాడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ యు.శ్రీహరి, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఇంటర్ విద్యార్థి దుర్మరణం



మండపేట, ఫిబ్రవరి 15: మండపేట తాపేశ్వరం కెనాల్ రోడ్డులో గురువారం మధ్యాహ్నం లారీ బైక్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ఇంటర్ విద్యార్థి మృతిచెందాడు. పట్టణ అదనపు ఎస్ఐ నాంచారయ్య తెలిపిన వివరాలు ప్రకారం.. కపిలేశ్వరపురం మండలం అంగరకు చెందిన పడాల అఖిల్ మణికంఠ ఆదిత్య కళాశాలలో జూనియర్ ఇంటర్ ఎంపీసీ చదువుతున్నాడు. గురువారం మధ్యాహ్నం కాలేజీ నుంచి మండపేట తాపేశ్వరం వైపు బైక్‌పై వెళ్తుండగా తాపేశ్వరం నుంచి వస్తున్న లారీ ఢీకొట్టడంతో అఖిల్ అక్కడికక్కడే చనిపోయాడు. రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ, అర్బన్, రూరల్ సీఐలు అఖిల్‌జమా, శ్రీధర్‌కుమార్‌తో పాటు పట్టణ ఎస్ఐ హరికోటి సంఘటనా స్థలానికి పరిశీలించారు. ఇంటి నుంచి కళాశాలకు వెళ్లిన అఖిల్ ప్రమాదవశాత్తు మరణించటంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అఖిల్ మరణంతో సహచర విద్యార్థులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పట్టణ అదనపు ఎస్ఐ నాంచారయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో చుక్కల జింక మృతి

రాజవొమ్మంగి ఫిబ్రవరి 15: రాజవొమ్మంగి మండలం అప్పలరాజుపేట గ్రామ శివారు అటవీ ప్రాంతం నుంచి కుక్కల దాడి కారణంగా జనవాసంలోకి వచ్చిన చుక్కల జింక గురువారం మృతి చెందింది. బుధవారం గాయాలతో చుక్కల జింక అప్పలరాజుపేట గ్రామంలోకి రావడం గమనించిన స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ శాఖ అధికారుల ఆధీనంలో ఉన్న చుక్కల జింక గురువారం మృతి చెందడంతో అటవీ శాఖ సబ్ డీఎఫ్‌వో శ్రీరామరావు ఆధ్వర్యంలో అటవీశాఖ కార్యాలయం సమీపంలో చుక్కల జింకకు పోస్టు మార్టం నిర్వహించి దహనం చేశారు.

ఎన్నికల విధులకు సన్నద్ధం కావాలి

ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్



మొక్క అందిస్తున్న ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు అన్ని విధాలా సన్నద్ధం కావాలని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్ కుమార్ ఆదేశించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరగడానికి అందరూ సమష్టిగా పూర్తి సమన్వయంతో పని చేయాలని.. సర్వీసులో రిమార్కు లేకుండా విధులు నిర్వర్తించాలన్నారు. తూర్పుగోదావరి జిల్లా పోలీసు కార్యాలయం (డీపీవో)లో గురువారం ఆయన వార్షిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. వివిధ విభాగాల వార్షిక పనితీరు, జిల్లాలోని పరిస్థితులను ఆయనకు ఎస్పీ జగదీశ్ వివరించారు. అనంతరం డీపీవో ప్రాంగణంలో ఉన్న ఆయుధాగారం, డాగ్ స్క్వాడ్, బీడీ టీం, ఎంటీవో, ఆర్ఐ స్టోర్స్‌ని డీఐజీ సందర్శించారు. మినిస్టీరియల్, డీసీఆర్బీ, డీటీఆర్బీ, ఎస్బీ తదితర విభాగాలు సమర్పించిన వార్షిక పనితీరు నివేదికలను పరిశీలించారు. కమాండ్ కంట్రోల్‌లోని సీసీ కెమెరాల లైవ్ స్ట్రీమింగ్‌ని వీక్షించారు. ఎన్నికల దృష్ట్యా డీపీవో నుంచి సకాలంలో ఎన్నికలకు సంబంధించిన సమాచారం రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయానికి, ఉన్నతాధికారులకు చేరే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఆ మేరకు పోలీస్‌స్టేషను స్థాయి నుంచి సమాచార సేకరణ, క్రోడీకరణపై సిబ్బందికి అవగాహన కల్పించాలని ఆదేశించారు. అవాంఛనీయ సంఘటనలు జరిగిన సమయంలో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు లాఠీడ్రిల్, వెపన్ డ్రిల్, మాబ్ డ్రిల్‌ని సాధన చేయాలన్నారు. మద్యం, గంజాయి, సారా అక్రమ రవాణా నియంత్రించాలన్నారు. సిబ్బందికి జిల్లా స్థాయిలో పరిష్కారం కాకుండా ఉన్న సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తొలుతగా ఏఆర్ అడిషనల్ ఎస్పీ చెంచిరెడ్డి ఆధ్వర్యంలో రిజర్వు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పరేడ్ కమాండర్‌గా సాయుధ రిజర్వు పోలీసు సిబ్బంది చేసిన కవాతును డీఐజీ వీక్షించి గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(శాంతి భద్రతలు) పి.అనీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికే భరోసా యాత్ర

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 15: రేషన్ డీలర్స్ సమస్యల పరిష్కారానికే భరోసా యాత్ర చేస్తున్నామని రేషన్ డీలర్స్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలా మాధవరావు అన్నారు. భరోసా యాత్ర రాజమహేంద్రవరం చేరుకున్న సందర్భంగా హోటల్ జగదీశ్వరిలో గురువారం సాయంత్రం జరిగిన రేషన్ డీలర్స్ సమావేశంలో మాట్లాడారు. ఆహార భద్రత చట్టం పీడీఎస్ కంట్రోల్ ఆర్డర్ ప్రకారం నిబంధనలను అనుసరించి రేషన్ డీలర్స్ ద్వారా మాత్రమే రేషన్ సరుకులు పంపిణీ చేయాలని, తెలంగాణ మాదిరి డీలర్స్‌కి గౌరవ వేతనం కల్పించాలన్నారు.రేషన్ డీలర్స్, ఎండీయూ ఆపరేటర్లకు చెల్లించాల్సిన బకాయిలు ఈనెల 25వ తేదీలోపు చెల్లించాలన్నారు. రేషన్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా జామి కృష్ణ, గౌరవ అధ్యక్షుడిగా బి.నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేవీవీ రమణ, ఉపాధ్యక్షులుగా మంగం రామారావు (పెరవలి), వెంకటేశ్వరరావు (ఉండ్రాజవరం), ప్రధాన కార్యదర్శిగా వై.వెంకటరత్నం, కార్యదర్శిగా కె.కామేశ్వరరావు (కడియం), ఆర్గనైజింగ్ సెక్రటరీగా రంగా (నిడదవోలు)ను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడపా రమణ, రాష్ట్ర కోశాధికారి రాజులపాటి గంగాధర్ గౌడ్, తూర్పుగోదావరి, కాకినాడ జిల్లా అధ్యక్షుడు జామి కృష్ణ, పల్లయ్య, గొర్రెల సత్తిబాబు, అన్ని మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఏజెన్సీ సమాచారం

మల్లవరం గ్రామంలో తాగునీటి కోసం కటకట

మోతుగూడెం,ఫిబ్రవరి15: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న మల్లవరం గ్రామస్థులు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. మంచినీళ్లు కావాలంటే వాగు దగ్గరికి కాలినడకన వెళ్లి రావాల్సిందే. మల్లవరం గ్రామం మోతుగూడెం సమీపంలోని అటవీ ప్రాంతానికి సుమారు 25 సంవత్సరాలు క్రితం కొన్ని కుటుంబాలు వచ్చి స్థిరపడ్డాయి. వారికి గొంతు తడుపుకునేందుకు గుక్కెడు నీళ్లు దొరకడం లేదు. ఇక్కడ 15 సంవత్సరాల కిందట సీఆర్పీఎఫ్ 141 అధికారులు బోరు తీయించారు. అయితే దాని ద్వారా మూడు నాలుగు బిందెలే మంచి నీళ్లు వస్తాయి. ఆ తర్వాత అంతా మురికి నీరు వస్తుంది. దీంతో వారు ఆ గ్రామ సమీపంలోని వాగు వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. ఈ వాగులో నీరు కలుషితంగా ఉండటంతో గిరిజనులు మలేరియా, టైఫాయిడ్, విషజ్వరాల బారిన పడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోరు. ఈ గ్రామానికి వెళ్లడానికి సరైన రహదారి సౌకర్యం లేదు. విద్యుత్ సదుపాయం లేక రాత్రుళ్లు బిక్కుబిక్కుమంటూ ఉంటున్నారు. ఈ గ్రామం అవస్థలపై మోతుగూడెం పంచాయతీ కార్యదర్శి రవినాయక్‌ను వివరణ కోరగా బోరుకు మరమ్మత్తులు చేయిస్తామని, విద్యుత్ సమస్యలపై అధికారులతో చర్చించి పరిష్కార మార్గం చూపిస్తామన్నారు. నిధులు కొరత ఉందని నిధులు సమకూర్చిన తర్వాత ఒక్కొక్క పని చేస్తామన్నారు. ఎంత లోతులో బోరు తవ్వినా నీరు రాకపోవడంతో ఊరి చివర్లో ఉన్న వాగు నుంచి పైపు లైను ద్వారా నీరు అందించాలని సర్పంచ్ ఆకేటి సీత, పంచాయతీ కార్యదర్శి రవినాయక్ అధికారులను కోరారు.

బంద్‌ను జయప్రదం చేయాలి

రంపచోడవరం, ఫిబ్రవరి 15: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు. ధర కల్పించాలని, కార్మికులు, ప్రజలు సమస్యలు పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ శుక్రవారం చేపట్టే భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని అఖిల భారత రైతుకూలీ సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి కుంజా దూలయ్య పిలుపునిచ్చారు. గురువారం స్థానిక మార్క్స్-ఏంగిల్స్ భవనంలో ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు వంజం జోగారావు, అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా కార్యవర్గ నాయకుడు పల్లాల లచ్చిరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దూలయ్య మాట్లాడుతూ 500 పైగా రైతు సంఘాలు, కార్మిక జేఏసీ, సంయుక్త కిసాన్ మోర్చాలు ఎస్కేఎంగా ఏ ర్పడి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలపై నిరసనను వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. తొలుత ప్రధాన కూడలి అంబేడ్కర్ సెంటర్‌లో సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వం, ప్రైవేట్ విద్యా, వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా సహకరించాలని కరపత్రాలతో ప్రచారం చేశారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఎస్.చిలకమ్మ, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు కత్తుల బాలురెడ్డి, ఐ.వి.రమణ, పీడీఎస్‌యూ డివిజన్ నాయకులు డి.నాగరాజు పాల్గొన్నారు.

బంద్‌కు అన్ని వర్గాలు సహకరించాలి

దేవీపట్నం, ఫిబ్రవరి 15: రైతు సమస్యల పరిష్కారం కోసం నిర్వహించతలపెట్టిన అఖిలభారత్ బంద్‌ను జయప్రదం చేయాలని రైతు కూలీ సంఘం అధ్యక్షుడు ఎస్.ఝాన్సీ పిలుపునిచ్చారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కోసం, రైతు రుణాల మాఫీ కోసం ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలమైన తర్వాత ఈనెల 13వ తేదీన ముందుగా ప్రకటించిన విధంగా చలో ఢిల్లీకి రైతు సంఘాలు పిలుపునిచ్చాయన్నారు. అయినప్పటికీ పంజాబ్, హరియానా రైతులను అడ్డుకోవడం హేయమైన చర్య అని అన్నారు. వేలాది మంది రైతులు పంజాబ్ నుంచి హరియానా సరిహద్దుకు చేరుకోగానే హరియాణాలో బీజేపీ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం రైతులను అడ్డుకోవడం, ఢిల్లీ గడప తొక్కకుండా చేసి ఇనుప కంచెలతో భారత్-పాకిస్తాన్ సరిహద్దు మూసివేసినట్లు మూసివేయడం దారుణమని అన్నారు. బీజేపీ పాలకుల దారుణ దమనకాండను రైతు కూలీ సంఘం తీవ్రంగా ఖండిస్తోందన్నారు.

జీసీసీ ద్వారా మార్కెటింగ్

దేవీపట్నం,ఫిబ్రవరి15: ఏజెన్సీలోని గిరిజనులు దళారుల దగ్గర మోసపోకుండా అటవీ ఉత్పత్తులు జీసీసీ ద్వారా మార్కెటింగ్ చేసే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు రాష్ట్ర జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్‌కుమార్ చెప్పారు. పెదభీంపల్లి, పోతుకొండ గ్రామాల్లో వందన్ వికాస కేంద్రాల సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఏజెన్సీలో ఒక్కొక్క విడివికెలో 300 మంది సభ్యులు ఉంటారని అదే విధంగా గిరిజనులు పండించిన జీడిమామిడి పిక్కలు, జొన్నలు తదితర వాటిని ప్రాసెసింగ్ చేయడానికి వివిధ రకాలైన మిషన్లు ఏర్పాటు చేస్తామన్నారు. వందన్ వికాస కేంద్రాలు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా చూస్తామన్నారు. కార్యక్రమంలో జీసీసీ డివిజనల్ మేనేజర్ జి.పార్వతీశ్వరరావు, వెలుగు ఏపీడీ ఎ.శ్రీనివాసరావు, జీసీసీ మార్కెటింగ్ సెక్షన్ అధికారి ఆర్‌వీ రమణమూర్తి, ఫిరోజ్, ఎంవీఎస్ రాజారెడ్డి, రామరాజు పాల్గొన్నారు.

ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ పర్యటన

మోతుగూడెం, ఫిబ్రవరి15: చింతూరు, రంపచోడవరం ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ గురువారం తులసిపాక, గూడూరు, బొడ్డగూడెం, విద్యానగరం, ఈడీపల్లి, నల్లకుంట, కేఎస్‌పురం స్కూల్స్‌లను సందర్శించారు. పదో తరగతి స్కూల్స్ అన్నీ 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఆశ్రమ స్కూల్లో ఉన్న హాస్టల్ సదుపాయాలు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు మెనూ క్రమం తప్పకుండా పాటించాలని వార్డెన్లకు సూచించారు. టాయిలెట్స్ శుభ్రంగా ఉండాలని సూచించారు. ఈ రోజురాత్రి కేఎస్ పురం స్కూల్ నందు నిద్రిస్తున్నట్లు తెలిపారు.

మంచి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న జడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి

వరరామచంద్రాపురం, ఫిబ్రవరి 15: రానున్న వేసవి కాలంలో మండలంలో మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని జడ్పీటీసీ సభ్యుడు వాళ్ళ రంగారెడ్డి అధికారులకు సూచించారు. రేఖపల్లిలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ కారం లక్ష్మి అధ్యక్షతన గురువారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ మండలంలోని కొండరెడ్ల గిరిజన గ్రామాల్లోని రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని, త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులను కోరారు. అనంతరం శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్‌కుమార్, చిన్నమట్టపల్లి ఎంపీటీసీ పూనెం ప్రదీప్ మాట్లాడుతూ కల్లునూరులో ఇవ్వాల్సిన రేషన్ జీడిగుప్ప గ్రామంలో ఇవ్వడమేమిటని ప్రశ్నించారు. రేఖపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలని, రోగులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేదిలేదని అన్నారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి రేషన్ సరిగ్గా ఇవ్వక పోవడంతో వర్కర్లు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే రేషన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఫణీందర్‌రెడ్డి, తహశీల్దార్ సయ్యద్ మౌలానాఫాజిల్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తంటికొండ వెంకన్న బ్రహ్మోత్సవాలు

గోకవరం, ఫిబ్రవరి 15: మండలంలోని తంటికొండ గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఉత్సవాల్లో భాగంగా దేవస్థానం చైర్మన్ బదిరెడ్డి రెడ్డియ్య సూర్యనాగకళ్యాణి దంపతులు స్వామివారికి విశ్వక్సేన పూజ పుణ్యావచనం, అభిషేకం, గోపూజ, విశేష హోమం నిర్వహించారు.

సాగుకు 9గంటల విద్యుత్ ఇవ్వాలి


» ట్రాన్స్‌కో ఏఈ రామకృష్ణారెడ్డి వినతి

రంగంపేట, ఫిబ్రవరి 15: వ్యవసాయ మోటార్లకు 9గంటలు నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మండల రైతులతో కలిసి రంగంపేట ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీరు వారి కార్యాలయంలో విద్యుత్ ఏఈ చిట్టూరి నాగేశ్వరరావుకు వినతి అందించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మెట్టలో పంటలు మరో 15-20 రోజుల్లో చేతికి రానున్నాయని, ఈ పరిస్థితిలో నీరందక రైతు కొట్టిమిట్టాడుతున్నాడని, విద్యుత్ సరఫరాపై అధికారులు కూడా సమాధానం చెప్పలేని స్థితిలో ఉన్నారన్నారు. జ్యోతుల నెహ్రూ ఎమ్మెల్యేగా ఉండగా ఏర్పాటు చేసిన చాగల్నాడు ప్రాజెక్టును కాంగ్రెస్ హయాంలో నిర్వీర్యం చేసిందని, మళ్లీ టీడీపీ అధికారంలోకి వచ్చాక మరమ్మతులు చేసి పునరుద్ధరించిందని గుర్తు చేశారు. అయితే దానిని వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే రంగంపేట మండలంపై వివక్ష చూపుతున్నారని, వైసీపీ పాలనలో రైతుల కష్టాలు కష్టాలుగానే ఉండిపోయాయన్నారు. టీడీపీ-జనసేన రైతులకు అండగా ఉండి 9గంటల విద్యుత్ నిరంతరంగా వచ్చే వరకూ ఐక్యంగా పోరాడుతామని రామకృష్ణారెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్, వెలుగుబంటి సత్తిబాబు, పోతుల వెంకటరావు, పూసల శ్రీను, సిరసపల్లి నాగేశ్వరరావు, బాబా, మాచిన వెంకన్నదొర పాల్గొన్నారు.



రంగంపేటలో విద్యుత్ ఏఈకి వినతిపత్రం ఇస్తున్న రామకృష్ణారెడ్డి

చంద్రబాబును కలిసిన కృష్ణారెడ్డి



అనపర్తి, ఫిబ్రవరి 15: టీడీపీ నాయకుడు, ఆది యూత్ ప్రతినిధి మల్లిడి కృష్ణారెడ్డి గురువారం ఉండవల్లిలో చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో యువత కష్టపడి పనిచేయాలని చంద్రబాబు సూచించారని, నియోజకవర్గంలో యువతను చైతన్య పరిచి టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.

యువత కోసం మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్

అనపర్తి, ఫిబ్రవరి 15: రాష్ట్రంలో వైసీపీ పాలనలో భవిష్యత్‌ను కోల్పోయిన యువతకు టీడీపీ అండగా నిలుస్తుందని దీని కోసం మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమాన్ని చేపడుతున్నామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. రామవరంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నా రాష్ట్రం, నా భవిష్యత్తు కోసం, యువత కోసం అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్టు చెప్పారు. టీడీపీ జనసేన ప్రభుత్వం ఏర్పడ్డాక 20లక్షల ఉద్యోగాలు కల్పించడమే ధ్యేయంగా చంద్రబాబు ప్రణాళిక రూపొందించారని, యువతకు ఉద్యోగం వచ్చేవరకు నెలకు రూ.3000 నిరుద్యోగ భృతి కల్పిస్తారన్నారు. కొత్తగా ఓటు హక్కు పొందిన యువత ఆలోచించి భవిష్యత్ బాగుండాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. దీని కోసం నియోజకవర్గ పరిధిలో 8 మంది వారియర్స్‌ను తయారు చేశామన్నారు. సమావేశంలో వారియర్స్ జుత్తుగ సూర్యకుమారి, పోతంశెట్టి సుభాషిణి, సత్య, అభినవ్, నాని, విజయ్, రాంబాబు, సిద్ధార్థరెడ్డి పాల్గొన్నారు.


చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్న డాక్టర్ రామ్‌గోపాల్‌రెడ్డి, సెంట్రల్ బోర్డు మాజీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి

టీడీపీలో చేరిన పలువురు ప్రముఖులు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 15: టీడీపీలోకి పలువురు ప్రముఖులు చేరారు. మంగళగిరిలో గురువారం టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో రాజమహేంద్రవరానికి చెందిన ఏసీవైరెడ్డి మనవడు డాక్టర్ రజనీష్‌రెడ్డి తండ్రి డాక్టర్ సి.రామ్‌గోపాల్‌రెడ్డి, సెంట్రల్ కాటన్ బోర్డు మాజీ సభ్యుడు సి.శ్రీనివాస్ రెడ్డి టీడీపీలో చేరారు. వారికి మెడలో పార్టీ కండువాలు వేసి స్వాగతించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ మంత్రి భూమా అఖిలప్రియ తదితరులు పాల్గొన్నారు.

లీగల్ మెట్రాలజీ అధికారుల కొరడా

విస్తృత తనిఖీలు.. 24 కేసులు నమోదు



తనిఖీలు చేస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారులు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): తూనికలు కొలతల శాఖ (లీగల్ మెట్రాలజీ) అధికారులు కొరడా ఝుళిపించారు. ఆ శాఖ కంట్రోలర్ ఆదేశాలతో జిల్లా అధికారులు 6 ప్రత్యేక బృందాలుగా ఏర్పడి విస్తృత తనిఖీలు చేశారు. గ్యాస్ కంపెనీలు, వంటనూనెలు, నిత్యావసరాలు విక్రయించే దుకాణాలు, డీమార్ట్, రిలయన్స్, విజేత మార్ట్, ఎస్‌వీజీ మార్కెట్, రైస్ స్టోర్లు, పండ్ల దుకాణాల్లో నిబంధనలన ప్రకారం సోదాలు చేశారు. నిబంధనల అతిక్రమణలను గుర్తించారు. తక్కువ తూకం ఉన్న వంటగ్యాస్ సిలిండర్లు అమ్ముతున్నందుకు 5 కేసులు, బియ్యం, పండ్ల వ్యాపారులపై ఒకొక్క కేసు, తయారీదారుడి చిరునామా తదితర వివరాలు లేకుండా విక్రయిస్తున్నందుకు 17 కేసులు మొత్తం 24 కేసులు నమోదు చేశారు. ఎంఆర్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయించినా తక్కువ తూకం ఉన్నా తూనికలు కొలతల శాఖ హెల్ప్‌లైన్ నెంబరు 1967కి ఫిర్యాదు చేయాలని అధికారులు వినియోగదారులకు సూచించారు. సోదాల్లో ఏలూరు సంయుక్త నియంత్రికులు పి.సుధాకర్, కాకినాడ ఉప నియంత్రికులు ఎస్.జనార్దనరావు, సహాయ నియంత్రికులు శామ్యూల్ రాజు, రాజేశ్, సలీం, ఇన్‌స్పెక్టర్లు సరోజిని, ప్రసాద్, శివబాలాజీ, కుటుంబరావు, నాగేంద్రకుమార్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు డీఎస్పీలు బాధ్యతలు స్వీకరణ




రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా జిల్లాలో నియమితులైన ఇద్దరు డీఎస్పీలు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్పీ జగదీశ్‌ని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలను అందజేశారు. సీఐడీ విభాగంలో కర్నూలు రేంజ్‌లో పని చేస్తున్న దేగల ప్రభాకర్ ఎస్‌బీ డీఎస్పీగా, సత్తెనపల్లి డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న బి.ఆదినారాయణ దిశా డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు.

'ఎలక్టోరల్ బాండ్లు రద్దు స్వాగతిస్తున్నాం'

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 15: ఎలక్టోరల్ బాండ్ల రద్దును స్వాగతిస్తున్నాం అని సీపీఎం పేర్కొంది. ఈ మేరకు గురువారం సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ ఒక ప్రకటన విడుదల చేస్తూ ఎలక్టోరల్ బాండ్లు పథకం సమాచారహక్కును ఉల్లంఘిస్తుందని, తద్వారా రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1) ఏ ప్రకారం వాక్ స్వాతంత్ర్యం, భావ వ్యక్తీకరణను దెబ్బతీస్తుందని కోర్టు పేర్కొందని తెలిపారు.

అధునాతన పరికరాలతో ఫెర్టిలిటి సెంటర్

లక్ష్మి సంతానోత్పత్తి కేంద్రం ప్రారంభంలో ఎంపీ భరత్


సంతానోత్పత్తి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ భరత్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 15: రాజమహేంద్రవరం దానవాయిపేటలో ఇందిరా ఐవీఎఫ్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన లక్ష్మి ఫెర్టిలిటి సెంటర్‌ను గురువారం ప్రారంభించారు. రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆదిరెడ్డి శ్రీనివాస్ హాజరయ్యారు. అధునాతన వైద్యపరికరాలతో ఈ ఫెర్టిలిటీ సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చిన ఇందిరా ఐవీఎఫ్ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ తృప్తి గణపతి, డాక్టర్ వి.ప్రదీప్తి కరుణ, డాక్టర్ లక్ష్మీప్రసన్న, డాక్టర్ పి.రమేష్‌బాబులను అభినందించారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు బలభద్ర వెంకట్రాజు, డాక్టర్ దాట్ల భాస్కరరాజు, డాక్టర్ రఘువీర్, డాక్టర్ డి.సతీష్, ప్రముఖ ఆడిటర్ ముసునూరి మోహన్, నందూరి సుబ్బారావు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికి తీసేందుకు డిజిటల్ మేళాలు

సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాదరెడ్డి

బిక్కవోలు, ఫిబ్రవరి 15: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడానికి డిజిటల్ మేళాలు దోహదపడతాయని సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాదరెడ్డి తెలిపారు. పందలపాక ఉన్నత పాఠశాలలో గురువారం ఎస్‌పీపీ సంస్థ సౌజన్యంతో ప్రథమ ఇన్ఫోటెక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐటీసీ సహకారంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ డిజిటల్ మేళాను ఆయన ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రాజెక్టులను పరిశీలించారు. మేళాలో పాల్గొన్న విద్యార్థులకు ప్రదం ఇన్ఫోటెక్ వారి ద్వారా ప్రశంసా పత్రాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, పీఎంసీ చైర్మన్ కొవ్వూరి నాగిరెడ్డి, ఎంపీటీసీ కర్రి గీత, కంప్యూటర్ ఉపాధ్యాయులు డి.సత్యదేవి, కె.బిందుమాధవి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

సీతానగరం, ఫిబ్రవరి 15: మండలంలో జరిగే ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని డ్వామా పీడీ ఎ.ముఖలింగం సూచించారు. గురువారం ఆయన ఏపీడీ బి.రామ్‌ప్రసాద్, ఏపీవో నాగేశవేణిలతో కలసి ముగ్గుళ్ల గ్రామంలో జరుగుతున్న పంట బోదె పూడికతీత పనులను పరిశీలించారు. రోజుకు రూ.272 వచ్చే విధంగా పనులు చేయాలని కూలీలకు సూచించారు. ప్రతి కూలీ 100 రోజుల పనిని పూర్తిచేయాలన్నారు. అనంతరం ఎన్ఆర్ఈజీఎస్, సిబ్బంది, ఫీల్డ్‌అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ కూలీల సంఖ్య 1000కు తగ్గకుండా చూడాలని, 2024-25 సంవత్సరానికి చేయవలసిన పనులను గుర్తించి ఆమోదం పొందాలన్నారు. కార్యక్రమంలో జేఈ ఇన్‌చార్జి అంజనీకుమార్, టెక్నికల్ అసిస్టెంట్ చక్రవర్తి, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన ఎన్నికల ప్రచారం ప్రారంభం

సీతానగరం, ఫిబ్రవరి 15: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన కలసి పోటీచేస్తున్న నేపథ్యంలో రాజానగరం నియోజకవర్గం సీటు జనసేనకు కేటాయించడంతో ఆ పార్టీ తరఫున బత్తుల వెంకటలక్ష్మి, బత్తుల బలరామకృష్ణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వెంకటలక్ష్మి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతానగరంలో ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా ఉమా విశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవం

కోరుకొండ, ఫిబ్రవరి 15: జంబుపట్నంలో నూతనంగా నిర్మించిన ఉమా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద గురువారం సాయంత్రం ఉమా విశ్వేశ్వర్ల కల్యాణం వైభవంగా జరిగింది. అన్నవరం దేవస్థానం నుంచి వచ్చిన పండితులు కల్యాణం నిర్వహించారు. స్వామివారిని జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బత్తుల బలరామకృష్ణ వెంకటలక్ష్మి దంపతులు దర్శించుని రూ.2,01116 విరాళాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు పుల్లి బుజ్జిబాబుకు అందజేశారు. తొమ్మిది మంది దంపతులు పీటలపై కూర్చుని స్వామి వారి కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో సర్పంచ్ పుల్లి అప్పన్నదొర, నాగా రమేష్, నాగా సత్యనారాయణ, కోరుకొండ సర్పంచ్ కర్రి లక్ష్మిసరోజ, నర్సాపురం సర్పంచ్ కడియాల పాపారావు, కాపవరం సర్పంచ్ జాజుల రాము, కంటే నాగ కేశవరావు, అడపా వీరబాబు పాల్గొన్నారు.

వైభవంగా అంకాలమ్మ జాతర

రాజానగరం, ఫిబ్రవరి 15: నరేంద్రపురంలో ప్రగడ వంశీయుల ఇలవేల్పు శ్రీఅంకాలమ్మ జాతర గురువారం వైభవంగా జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా 5 జిల్లాల్లోని 140 గ్రామాలకు చెందిన ప్రగడ వంశీయులు విచ్చేసి జాతరను తిలకించి, అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. ఐదు రోజులుగా అమ్మవారి ఆలయంలో కోలాటం, పంబనాథం కథ గానామృతం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, సీఐ పి.కాశీవిశ్వనాథ్‌తో పాటు పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రగడ వంశస్థులు, ప్రముఖుల రాకతో నరేంద్రపురం తిరునాళ్లను తలపించింది. అనంతరం ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనలో వేలాది మంది పాల్గొన్నారు.

రాజానగరంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

రాజానగరం, ఫిబ్రవరి 15: మండలంలో పలు గ్రామాల్లో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా గురువారం శ్రీకారం చుట్టారు. మండలంలోని తోకాడలో రుడా నిధులతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. అలాగే తోకాడ చెరువు రివిట్‌మెంట్ పనులకు, జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా నిర్మించనున్న ఓవర్ హెడ్ ట్యాంకు పనులకు శంకుస్థాపన చేశారు. తాగునీటి బోరు, పైపులైన్‌ను, ఎస్సీ కమ్యూనిటీ హాలు భవనాన్ని ప్రారంభించారు. పరిజల్లిపేట, కానవరంలో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకులకు ప్రారంభోత్సవాలు చేశారు. కార్యక్రమాల్లో జడ్పీటీసీ వాసంశెట్టి పెద్దవెంకన్న, దూలం పెద్ద, మండారపు వీర్రాజు, గండి నానిబాబు, ఉండమట్ల రాజబాబు, గంగిశెట్టి సోమేశ్వరరావు, వేమగిరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా మోది

రాజానగరం, ఫిబ్రవరి 15: బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా మోది సత్తిబాబు నియమితులయ్యారు. రాజానగరానికి చెందిన సత్తిబాబు గతంలో యువమోర్చా మండలాధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, బీజేపీ మండలాధ్యక్షుడిగా, అసెంబ్లీ కన్వీనర్‌గా, పార్లమెంట్ కన్వీనర్‌గా, ఎయిర్‌పోర్ట్ అడ్వైజరీ బోర్డు మెంబర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఈ నెల 17,18 తేదీల్లో ఢిల్లీలో జరిగే జాతీయ కార్యవర్గ సమావేశాలకు వెళ్లనున్నట్టు మోది తెలిపారు. ఈ సందర్భంగా సత్తిబాబుకు జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు అభినందనలు తెలిపారు.

15 మద్యం సీసాలు స్వాధీనం

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ యువకుడిని త్రీటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మల్లయ్యపేటలోని ఓ చోట మద్యం సీసాలు విక్రయిస్తుండగా పి.వెంకటేశ్‌ని అరెస్ట్ చేసి 15 క్వార్టరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశామని సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ తెలిపారు.

వైభవంగా దేవీ గౌరీశంకర్ల రథోత్సవం

అమ్మవారి సారె మోసిన 1000 మంది మహిళలు

కోరుకొండ, ఫిబ్రవరి15: మండలంలోని శ్రీరంగపట్నంలో గురువారం దేవీ గౌరీశంకర్ల రథోత్సవం వైభవంగా సాగింది. అంతకుముందు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చారి బొడ్డువెంకటరమణచౌదరి, జనసేన ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, జక్కంపూడి గణేష్ ఆధ్వర్యంలో కొత్త రథానికి పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని సుమారు 1000 మంది మహిళలు అమ్మవారికి చీర సారె సమర్పించారు. అనంతరం గ్రామస్థులతో కలిసి బీవీఆర్, బత్తుల రథాన్ని లాగి రథోత్సవం ప్రారంభించారు. సారె ఊరేగింపులో పాల్గొన్న 1000 మందికి పైగా మహిళలకు జనసేన మహిళాసాధికార కమిటీ కో ఆర్డినేటర్‌బత్తుల వెంకటలక్ష్మి రవికెలు పంచారు.

శ్రీదేవి గౌరీశంకరుల రథోత్సవానికి లక్ష విరాళం

గోకవరం, ఫిబ్రవరి 15: శ్రీరంగపట్నంలో జరిగిన శ్రీదేవి గౌరి శంకరుల రథోత్సవంలో హిందూ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రథోత్సవానికి రూ.లక్షను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో రామసేన సభ్యులు తామర్ల రాంబాబు, మామిడి అయ్యప్ప, ఇనగోటి బాపన్నదొర, వరసాల ప్రసాద్, వల్లూరి జగన్నాథశర్మ తదితరులు పాల్గొన్నారు.

లోవోల్టేజీ సమస్యకు పరిష్కారం

బిక్కవోలు, ఫిబ్రవరి 15: లోవోల్టేజీ సమస్యతో బాధపడుతున్న పందలపాక, కొంకుదురు, కొమరిపాలెం, ఆరికరేవుల, మెళ్లూరు గ్రామాల ప్రజల సమస్యలు నేటితో తీరాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పందలపాకలో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఐదు గ్రామాల్లో 30 ఏళ్లుగా లోవోల్టేజీతో బాధపడుతున్నారని, ఎంతో మంది గృహోపకరణాలు కోల్పోయారన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రొంగల పద్మావతి, సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాదరెడ్డి, కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, కిలపర్తి సత్యనారాయణ, పోతుల ప్రసాదరెడ్డి, వల్లూరి పరశురామచౌదరి, ట్రాన్స్‌కో ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి, ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ, ఏడీఈ ఎం.నిరంజన్‌బాబు, ఏఈ బుజ్జిదొర పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి అదృశ్యంపై ఆయన భార్య ఫిర్యాదుతో బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కవలగొయ్యి పంచాయతీ ఆఫీస్ పక్కన కుటుంబంతో నివాసం ఉంటున్న ఎర్రా శ్రీనివాస్ ఓ స్వీట్ షాపులో పనిచేస్తున్నాడు. ఈ నెల 25న విజయవాడ వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లి ఈ రోజు వరకూ తిరిగి రాలేదని భార్య దుర్గ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాని సీఐ ఎండీ ఉమర్ తెలిపారు.

10 బీర్లు స్వాధీనం.. యువకుడి అరెస్ట్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ యువకుడిపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మెరకవీధికి చెందిన కుడుపూడి విశ్వేశ్వరరావు బియ్యం వ్యాపారం చేస్తుంటాడు. గురువారం డీలక్స్ సెంటర్‌లో అతడు బైక్‌పై వెళ్తుండగా పోలీసులు తనిఖీ చేయగా 10 బీర్లు గుర్తించారు. ప్రభుత్వ మద్యం షాపుల్లో కొనుగోలు చేసి మూసేసిన తర్వాత ఎక్కువ ధరలకు అతడు విక్రయిస్తుంటాడని ప్రాథమికంగా తేలింది. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు



తొర్రేడు జడ్పీ హైస్కూల్ 1976-81 బ్యాచ్ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల కలయిక

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 15: రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడులోని జడ్పీ హైస్కూల్లో 1976-81 సంవత్సరంలో చదువుకున్న పూర్వపు విద్యార్థులు స్థానిక జేఎస్ రోడ్డులోని ప్రైవేటు ఫంక్షన్‌హాల్లో గురువారం కలిశారు. 42 ఏళ్ల తర్వాత కలుసుకున్న మిత్రులు ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆనాడు చేసిన అల్లరి చేష్టలను, గడిపిన మధుర క్షణాలను గుర్తుచేసుకుని సరదాగా గడిపారు.భావోద్వేగాలకు గురయ్యారు. చిన్ననాటి స్నేహితులంతా ఒకచోట కలుసుకోవడం సంతోషంగా ఉందని అమెరికా నుంచి మిత్రులను కలుసుకునేందుకు వచ్చిన దాసరి పాపారావుచౌదరి, కొత్తపల్లి శ్రీనివాసచౌదరి అన్నారు. సమ్మేళనానికి కృషి చేసిన చిట్టూరి రంగారావు, పోలిన కృష్ణ, బోగవల్లి పద్మ తదితరులకు అభినందనలు తెలిపారు.

పేదలకు ఉచిత వైద్య శిబిరం

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 15: రాజమహేంద్రవరం 40,41 డివిజన్లలో కోటిలింగాలపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద భవాని చారిటబుల్ ట్రస్ట్, వాసవి శ్రీ మల్టీస్పెషాలిటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు ప్రారంభించారు. ఈ శిబిరంలో వైద్యపరీక్షలు చేయించుకున్న ప్రజలకు దొండపాటి సత్యంబాబు, మర్రి దుర్గా శ్రీనివాస్ మందులు ఉచితంగా పంపిణీ చేశారు.



రాజమహేంద్రవరం డీఎల్‌పీవోగా నాగలత

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 15 : రాజమహేంద్రవరం డివిజనల్ పంచాయతీ అధికారిగా ఎం.నాగలత బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు డీఎల్‌పీవోగా పనిచేసిన జానా సత్యనారాయణ నరసాపురం డీఎల్‌పీవోగా బదిలీ అయ్యారు.ఈ మేరకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ పంచాయతీ రాజ్ బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. సత్యనారాయణ డీఎల్‌పీవోగా ఉంటూ ఇన్‌చార్జి డీజీపీవోగా విధులు నిర్వహించారు. నాగలత రెండు రోజుల్లో విధుల్లో చేరనున్నట్టు తెలుస్తుంది.





ఉద్యోగులతో.. బంతాట!

- కుదింపునకు రేషనలైజేషన్ ప్రకటన
- ఇంకా విడుదల కాని మార్గదర్శకాలు
- అయోమయంలో సిబ్బంది
- జిల్లాలో 3940 మంది ఉద్యోగులు
- ఇప్పటికే 1500 మంది కొరత
- అదనపు విధులతో సతమతం
- మరింత తగ్గించే ప్రకటనపై ఆందోళన
- ఎన్నికల వేళ సర్దుబాటుపై ఆక్రందన

కూర్చోమంటే కూర్చోవాలి.. నిలబడమంటే నిలబడాలి.. పనిచేయమంటే పనిచేయాలి.. కాదు కూడదంటే కుదరదు.. ఇదేదో ప్రైవేటు ఉద్యోగుల కోసం కాదండోయ్.. ప్రభుత్వ ఉద్యోగులే.. అదేనండి.. సీఎం జగన్ మానసపుత్రిక అంటారే సచివాలయ సిబ్బంది.. వారి గురించే ఇదంతా.. ప్రతి సచివాలయానికి 11 మందిని నియమించారు.. మేం చేశామని గొప్ప చెప్పుకున్నారు.. ప్రస్తుతం రేషన్‌లైజేషన్ అంటున్నారు.. మేం చెప్పిన చోటుకి వెళ్లాలని హుకుం జారీ చేస్తున్నారు.. ఒక్కో సచివా లయంలో 8 మందిని ఉంచి మిగిలిన ముగ్గురిని సర్దుబాటు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.. దీంతో సచివాలయ సిబ్బంది ఎన్నికల వేళ ఇదేం తీరంటూ తీవ్ర ఆందోళనలో ఉన్నారు..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌కి రోజులు దగ్గర పడుతున్న వేళ సచివాలయ సిబ్బంది సర్దుబాటును ప్రభుత్వం తెరపైకి తెచ్చింది. ఇప్పటికే సచివాలయ సిబ్బందిని అన్ని పనులకూ వాడేస్తున్నారు. వైసీపీ సమావేశాలకు జనాలను తరలించడం..చివరికి ఆడుదాం ఆంధ్రా ఆటలకు వీక్షకులు కొరవడడంతో వారిని తీసుకొచ్చే పనిని సచివాలయ సిబ్బందికే అప్పగించారు. జగన్ సభలకైతే చెప్పనవసరం లేదు. వారం ముందు నుంచే పాట్లు మొదలవుతాయి. ఆడుదాం ఆంధ్రా ఆటలను చూడడానికి జనాలను తీసు కురాకపోతే సస్పెండ్ చేస్తామంటూ ఏకంగా ఓ ఐఏఎస్ అధికారి ఆ చిరుద్యోగులపై బెదిరింపులకూ దిగారు.ఇలా జాబ్ చార్టు ప్రకారం నిర్వర్తించాల్సిన విధుల కంటే అదనపు భారం ఎక్కువగా ఉందని సచివాలయ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్న తరుణంలో రేషనలైజే షన్ (సర్దుబాటు) అంటూ వాళ్లను మరింత ఆవేదనలోకి పాలకులు నెట్టేశారు.ఆ పేరుతో సచివాలయంలోని సిబ్బంది తగ్గింపునకు శ్రీకారం చుట్టడంతో ఉద్యోగులు సతమతమవుతున్నారు.

సచివాలయాల్లో 11 కాదు.. 8 మందే?

బదిలీలపై ఏదీ స్పష్టత

బదిలీలపై స్పష్టతలేకపోవడంతో అయోమయానికి గురవుతున్నారు. ప్రకటనే తప్ప ఇప్పటి వరకూ ఎలాంటి మార్గదర్శకాలు విడుదల కాలేదు. వారు పనిచేస్తున్న పట్టణం, మండల పరిధిలో బదిలీలు ఉంటాయా? జిల్లాలు మారుస్తారా? భార్యాభర్తలు ఒకే చోట లేదా దగ్గరలో పని చేస్తుంటే బదిలీల్లో ప్రాధాన్యం ఇస్తారా? అనారోగ్యాన్ని పరిగణనలోకి తీసుకుంటారా? ఇలా అనేక సందేహాలు సచివాలయాల సిబ్బంది బుర్రలో తిరుగుతున్నాయి. ఇప్పటికే మహిళా పోలీస్ విషయంలో సందిగ్ధం వీడలేదు. యూనిఫాం సర్వీసులకు కొన్ని నిబంధనలు ఉంటాయి. అవేవీ పట్టించుకోకుండా జగన్ ఇష్టానుసారం ఉద్యోగాల్లో నియమించడంతో సమస్య వచ్చిపడింది. వాళ్లకు యూనిఫాంను పోలీస్ శాఖ అభ్యంతర పెట్టడంతో వ్యవహారం కోర్టు మెట్లె క్కింది.ఈ చిక్కుముడులు వీడకుండానే రేషనలైజేషన్ అంటున్నారు. ఎక్కడికి ఏ ప్రాతిపదికన పంపిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే సచివాలయ సిబ్బంది ఎన్నికల విధుల్లో తలమునకలై ఉన్నారు. ఇప్పుడు మార్పులు చేస్తే ఇబ్బందులు తప్పకపోవచ్చు. ఎన్నికల దృష్ట్యా ప్రభుత్వం బదిలీలు చేస్తోందనే వాదన నడుస్తోంది. తమ కు అనుకూలమైన వాళ్లను 'కావాల్సిన చోటు'లో నియమించుకోడానికి ఇప్పటికే వైసీపీ నాయకులు రంగంలోకి దిగారని సమాచారం.దీంతో ఉద్యోగులు బెంబేలెత్తిపోతున్నారు. తిరుపతి ఉప ఎన్నికల విధుల్లో అక్రమాలు చేసిన పాపం రెండేళ్ల తర్వాత వెంటాడి ఏకంగా ఒక ఐఏఎస్ సస్పెన్షన్‌కి దారితీయడానికి గుర్తు చేసుకుంటు న్నారు. ఐఏఎస్ అంతటి అధికారి పరిస్థితే అలా అయితే తర్వాత ఇబ్బందులు ఎదురైతే తమను ఎవరు పట్టించుకుంటారనే ఆందోళన సచివాలయ ఉద్యోగుల్లో కనిపిస్తోంది.

ఎనిమిదికి తగ్గిన పదకొండు

ఒక సచివాలయంలో సంక్షేమ అభివృద్ధి కార్యదర్శి, వార్డు పరిపాలన కార్యదర్శి, విద్యాడేటా ప్రాసెసింగ్ కార్యదర్శి, మహిళ బలహీన వర్గాల భద్రత కార్యదర్శి(మహిళా పోలీస్), ఆరోగ్య కార్యదర్శి,ప్రణాళికా నియంత్రణ కార్యదర్శి, సదుపాయాల కార్యదర్శి, పారిశుధ్య పర్యా వరణ కార్యదర్శి, రెవెన్యూ కార్యదర్శి, ఇంధన కార్యదర్శి, అడ్మిన్ ఉంటారు. అయితే ఇప్పుడు సచివాలయానికి ఎనిమిది మంది చొప్పున ఉండేట్లు సర్దుబాటు చేస్తున్నారు. తక్కువగా ఉన్న చోటుకు 11 మంది ఉన్న సచివాలయం నుంచి సిబ్బందిని పంపించే ప్రక్రియ మొదలుపెట్టబో తున్నారు. 11 మంది ఉన్నా జగన్ చేప్పే పనులకు సిబ్బంది సరిపోని పరిస్థితి ఉంది. ఇప్పుడు రేషనలైజేషన్ పేరుతో మార్పులపై అనేక అనుమానాలు నెలకొన్నాయి.

జిల్లాలో 3933 మంది

జిల్లాలో మొత్తం 512 సచివాలయాల్లో పట్టణ ప్రాంతాల్లోని వార్డు సచివాలయాలు 119 ఉన్నాయి. మిగిలినవి గ్రామ సచివాలయాలు. వాటిలో మొత్తం సిబ్బంది 3940 మంది ఉన్నారు.మెటర్నిటీ, మెడికల్ తదితర కారణాలతో సెల వులో రోజూ 200 మంది వరకూ ఉంటారు. మిగతా 3700 మంది పనిభారం భరించాలి. వాస్త వానికి ప్రభుత్వం ముందు ప్రకటించిన సంఖ్య ప్రకారం చూస్తే జిల్లాలోని సచివాలయాల్లో సుమారు 5,500 మంది సిబ్బంది ఉం డాలి.కానీ ఇప్పటికే సుమారు 1500 మంది సిబ్బంది కొరత ఉన్నట్టు తెలుస్తోంది.ఈ పరిస్థితుల్లో 8 మంది ఉంటే చాలు అంటూ సిబ్బందిని మరింత కుదించే కార్యక్రమం చేపట్టబోతున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో సేవలు కొరవడే అవకాశం ఉంది.

ఇన్‌చార్జి ఎక్కడండీ?

దేశంలో ఎక్కడా లేని డిపార్టుమెంటును జగన్ జనం నెత్తిపై రుద్దారు. ఎక్కడా ఇలాంటి డిపార్టుమెంటు లేకపోవడంతో నిబంధనలనూ పక్కాగా రూపొందించాలి. కానీ ప్రచార ఆర్భాటం చేస్తున్న ప్రభుత్వం వాస్తవంలో వెనుకబడుతోంది. సచివాలయాలు తీసుకొచ్చిన తర్వాత గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా అధికారి పోస్టును సృష్టించారు.కానీ దానికి అధికారిని నియమించ కుండా డీఎల్‌డీవోలకు, డీఆర్‌డీఏ పీడీలకు అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు.గతంలో అభివృద్ధి విభాగానికి జాయింట్ కలెక్టర్ ఉండేవారు. ఆయన సచివాలయ బాధ్యతలూ చూసుకునే వారు.కానీ తర్వాత ఆ పోస్టును పట్టించుకోలేదు.పంచాయతీరాజ్‌లోని ఎంపీడీవోలకు పదోన్నతి ఇచ్చి డీఎల్‌డీవోలుగా నియమిస్తారు.ఆర్‌డీవో కంటే డీఎల్‌డీవోకి రెండు ఇంక్రిమెంట్లు ఎక్కువ. అంటే ఆర్‌డీవో కంటే డీఎల్‌డీవో(డివిజనల్ లెవెల్ డవలప్‌మెంట్ ఆఫీసర్) స్థాయి ఎక్కువ. వారిలో సీనియర్‌ని గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా అధికారిగా నియమించాలి. జిల్లాలో రెండు డివిజన్లకూ ఉన్న ఇద్దరు డీఎల్‌డీ వోలకు సచివాలయాల అదనపు బాధ్యత అప్పగించారు. ఇక సచివాలయాల శాఖ ఏ డిపార్టుమెంటు పరిధో ఇప్ప టికీ స్పష్టత లేదు.గ్రామాల్లో అయితే గ్రామీణాభివృద్ధి మంత్రి,పట్టణాల్లో పట్టణాభివృద్ధి మంత్రి కార్యక్రమాలకు హాజరవుతున్నారు. ఈ రుగ్మతలు తగ్గించకుండా ఎన్నికల వేళ సిబ్బందిని ఇబ్బంది పెట్టే కార్యక్రమం చేపట్టబోతున్నారు.



గోపాలపురంలో స్ట్రాంగ్ రూమ్ పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

ఎన్నికలకు ప్లానింగ్ ఉండాలి : కలెక్టర్

గోపాలపురం, ఫిబ్రవరి 15: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సామగ్రి పంపిణీకి సమగ్ర కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కే.మాధవీలత ఆదేశించారు. గోపాలపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఆశ్రమ బాలికల పాఠశాలలో నియోజకవర్గానికి ప్రతిపాదించిన పంపిణీ కేంద్రాన్ని, స్ట్రాంగ్ రూమ్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి శివజ్యోతి, ఇతర అధికారులతో కలిసి గురువారం పరిశీలించి మాట్లాడారు. ఎన్నికల నిర్వహణ, ఓటింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించే క్రమంలో ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. డాక్టర్ బీఆర్ అంబే డ్కర్ గురుకుల పాఠశాల నుంచి గోపాలపురం నియోజకవర్గంలోని 248 పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల మెటీరియల్ పంపిణీ చేస్తారన్నారు. ఆమె వెంట డిప్యూటీ తాహసీల్దార్ కృష్ణ,ప్రిన్సిపాల్ ఉమాదేవి ఉన్నారు.

రామయ్యకు కోటి శుభలేఖల యజ్ఞం

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 15 : లోకకల్యాణార్థం కోటి గోటి తలంబ్రాల దీక్షలో భాగంగా గురువారం పుష్కరాలరేవులో అయోధ్య రామయ్యకు కోటి శుభలేఖల యజ్ఞం, విశ్వశాంతి హోమం చేసినట్టు కల్యాణం అప్పారావు తెలిపారు.ఈ ఏడాది కోటి గోటి తలంబ్రాల సమర్పణలో భాగంగా గురువారం రాజమహేంద్రవరం గోదావరి పుష్కర్ ఘాట్ వద్ద కోటి తలంబ్రాలకు విశ్వశాంతి హారతి, కోటి వత్తులకు సీతారామ అష్టోత్తర శతనామ పూజ, అయోధ్య రామయ్య కోటి శుభలేఖలు యజ్ఞం ప్రారంభించారు. శ్రీరామ తత్వాన్ని ప్రచారం చేయడంలో భాగంగా 13 ఏళ్లుగా భద్రాచలం,ఏడేళ్లుగా అయోధ్య సీతారామచంద్ర మూర్తికి కోటి గోటి తలంబ్రాలు పంపిస్తున్నామని చెప్పారు.భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేటి నుంచి చందన యాత్ర మహోత్సవాలు

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 15 : కోరుకొండ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి క్షేత్రంలో చిన్నజీయర్ స్వామి మంగళశాసనములతో ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకూ వార్షిక చందన యాత్ర మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయని గురువారం ఆలయ ధర్మకర్తలు కాలెపు సూర్య సింహాచలం, అర్చకుడు అవసరాల శ్రీకిరణ్ స్వామి వెల్లడించారు. భక్తులు హాజరై స్వామిని దర్శించుకో వాలన్నారు. 21వ తేదీ బుధవారం ఉదయం 10 గంటల నుంచి శ్రీవారి ప్రసాదం,అన్నసమారాధన, సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం ద్వాద శారాధన,మహాపూర్ణాహుతితో ఉత్సవం పరిసమాప్తి అవుతుందన్నారు.

పది నిమిషాల్లో వస్తానని చెప్పి వెళ్లాడు..

16 రోజులైనా తిరిగిరాలేదు.. అమ్మమ్మ ఫిర్యాదు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు అమ్మమ్మను రోడ్డుపై వదిలేసి వెళ్లిపోవడంపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కొంతమూరుకు చెందిన జి.వెంకటేష్ గత నెల 29న అమ్మమ్మను రాజమహేంద్రవరంలో బస్సు ఎక్కించడానికి బైక్‌పై తీసుకుని బయలుదేరాడు.అయితే దానవాయిపేట వచ్చేసరికి ఫోన్ రావడంతో ఆమెను అక్కడ దింపేసి పది నిమిషాల్లో వస్తానని వెళ్లిపోయాడు. చాలా సమయం ఎదురుచూసి ఆమె తిరిగి కొంతమూరు వెళ్లిపోయింది. మనవడు జి.వెంకటేష్ గురువారం వరకూ తిరిగి రాకపోవడంతో కంగారు పడిన అమ్మమ్మ సత్యవతి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పుల్లారావు తెలిపారు.



ప్రమాదరహిత డ్రైవర్లను సత్కరిస్తున్న ప్రత్యూషకుమారి

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూషకుమారి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 15 : ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలు నివారించాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రత్యూషకుమారి అన్నారు. రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో గ్యారేజీలో గురువారం జరిగిన రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు సభలో ఆమె మాట్లాడారు. వాహనం నడిపే సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎంవీఐ సంపత్‌కుమార్ మాట్లాడుతూ ప్రమాదాలు జరగడానికి కారణాలు, ట్రాఫిక్ రూల్స్ గురించి వివరించారు. ఆర్టీసీ జిల్లా అధికారిణి కె.షర్మిల అశోక మాట్లాడుతూ జిల్లాలోని రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, గోకవరం డిపోలకు సంబంధించి 15 మంది ప్రమాదరహిత డ్రైవర్లను ఎంపి చేశామన్నారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. ప్రమాదరహిత డ్రైవర్లను కుటుంబసభ్యులతో సహా సత్కరించారు. జిల్లావ్యాప్తంగా ఆయా డిపోల పరిధిలో పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో నాలుగు డిపోల మేనేజర్లు పాల్గొన్నారు.



ప్రాజెక్టు గురించి వివరిస్తున్న విద్యార్థులు

నేటి విద్యార్థులే.. రేపటి శాస్త్రవేత్తలు

జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో జేసీ తేజ్‌భరత్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులో రాణించడంతో పాటు సృజనాత్మకతకు పదునుపెట్టి భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఎంపీ భరత్‌రామ్, జేసీ తేజ్ భరత్ పిలుపునిచ్చారు. జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన(ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల)ను సీజీటీఎం ఉన్నత పాఠశాలలో గురువారం ప్రారంభించి మాట్లాడారు. శాస్త్ర విజ్ఞాన రంగంలో భారత్ ఎన్నో విజయాలను సాధిస్తూ ప్రపంచ దేశాలకు గట్టి పోటీ ఇస్తోందన్నారు. పాఠశాల స్థాయిలో రూపొందిస్తున్న ఆవిష్కరణలు భవిష్యత్తులో స్ఫూర్తినివ్వాలన్నారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యసాధనకు పట్టుదలతో సాధన చేస్తే విజయాలు వాటంతటవే దరిచేరతాయన్నారు.కార్యక్రమంలో డీఈవో కె.వాసుదేవరావు, డిప్యూటీ ఈవో ఈవీబీఎస్.నారాయణ, డీఐ ఎస్.దిలీప్ కుమార్, రూరల్ ఎంఈవో ఎ.దుర్గా తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ లోకేషన్ ఐడెంటిఫికేషన్..

ఎమర్జెన్సీ లోకేషన్ ఐడెంటిఫికేషన్ యాప్ ద్వారా దగ్గరలోని పోలీస్ స్టేషన్, పంచాయతీకి అలారం ద్వారా అత్యవసర సమయంలో హెచ్చరికలు పంపించే పరికరాన్ని దేవరపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థి ఎం.సాయిరాం కృష్ణ తయారు చేశాడు. మహిళలు ప్రమాదంలో ఉన్న సందర్భంగా యాప్ ద్వారా సందేశం పంపించవచ్చని, జీపీఎస్‌తో అనుసంధానం చేయడం వల్ల బాధితులు ఎక్కడ ఉన్నారో తేలిగ్గా తెలుస్తుందని కృష్ణ చెప్పాడు.

టూ స్ట్రోక్ పవర్ స్ప్రేయర్

వ్యవసాయరంగంలో ఉపయోగపడే టూస్ట్రోక్ పవర్ స్ప్రేయర్ ని పీరా రామచంద్రాపురం స్కూల్ విద్యార్థిని సిద్ధాబత్తుల మధుబాల ఆవిష్కరించింది.ఈ స్ప్రేయర్‌తో ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేసుకోవచ్చని.. రైతులకు వెన్నునొప్పి వంటివి రాకుండా ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని మధుబాల తెలిపింది.

బయో ప్లాస్టిక్ తయారీ విధానం..

పర్యావరణ హానికరమైన ప్లాస్టిక్ వ్యర్థాలకు చెక్ పెట్టే దిశగా బయో ప్లాస్టిక్ తయారీ విధానాన్ని మల్లవరం జెడ్పీ హైస్కూలు విద్యార్థిని కె.పాలినా వివరించింది. కర్రపెండలం పిండి, గ్లిజరిన్, వెనిగర్, ఫుడ్ కలర్ ఉపయోగించి బయో ప్లాస్టిక్ తయారు చేసుకోవచ్చని పేర్కొంది.



విద్యార్థులు ఆవిష్కరించిన ప్రాజెక్టు పరిశీలిస్తున్న జేసీ తేజ్ భరత్, మేడపాటి షర్మిలారెడ్డి తదితరులు



రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల ఎదుట ఉద్యోగుల నిరసన ప్రదర్శన

ప్రభుత్వానికి తగిన శాస్తి చేస్తాం

రెండో రోజు అదే జోరు - నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి)/ రాజమహేంద్రవరం అర్బన్/ధవళేశ్వరం : సర్కారుపై ఉద్యోగులు యుద్ధం ప్రకటించారు.. డిమాండ్ల సాధనకు రోడ్డెక్కుతున్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక,పెన్షనర్ల ఐక్యకార్యాచరణ సమితి (ఏపీ జేఏసీ) ఇచ్చిన పిలుపుతో ఉద్యోగులు, ఉపాధ్యాయుల నిరసనలు జోరందుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లోనూ రెండో రోజు గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలిపారు. భోజన విరామ సమయంలో అందరూ బయటకు వచ్చి తమ జేఏసీ బ్యానర్ ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏపీ జేఏసీ కన్వీనర్ సేవా ప్రవీణ్‌కుమార్ మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు పరిష్కారం విషయంలో కపటి ప్రేమను ప్రదర్శిస్తుందని, ఉద్యోగుల పట్ల చిత్తశుద్ధి చూపడం లేదన్నారు. ఈ ప్రభుత్వానికి ఉద్యోగులు తగిన శాస్తి చేస్తారన్నారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలని,పేరుకు పోయిన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. తక్షణమే మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని ఆర్అండ్‌బీ కార్యాలయం, పోరెస్ట్ కార్యాలయం, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎదుట నినాదాలు చేశారు. ధవళేశ్వరంలో జేఏసీ కన్వీనర్ ఎస్.జైకుమార్ , జిల్లా ఉపాధ్యక్షుడు పాలిక రాజబాబు ఆధ్వర్యంలో ఉద్యోగులు ఇరిగేషన్ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ వద్ద నిరసన చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న అన్ని డీఏ ఏరియర్స్ విడుదల చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఉద్యోగుల హక్కులు, పెండింగ్ బకాయిలు సాధించే వరకు ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో సంఘం ఉపాధ్య క్షుడు ఎం.మాధవరావు, ప్రతాప్, ఆనంద్, నాగశ్రీనివాస్, 4వ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర రావు, ఏపీ డ్రైవర్ల సంఘం నాయకులు టీవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, కార్యదర్శి వెంకటరమణ, ,.క్లాస్4 ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆలిండియా ఉపాధ్యక్షుడు వి.వెంకటేశ్వర్లు, బి.లక్ష్మణుడు,పీఎస్ శేషుకుమార్, ఎం.సతీష్, ఎస్‌కే సయ్యద్ బాజీ, ఎస్.వాసుదేవి, డి.కృపారావు,రామభద్రరావు పాల్గొన్నారు.



ధవళేశ్వరంలో ఇరిగేషన్ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ వద్ద ఉద్యోగుల నిరసన



అనుమానం.. పెనుభూతమై

- పచ్చనికుటుంబంలో చిచ్చు
- భార్యను హత్య చేసి..
- భర్త ఆత్మహత్య

8

పేదల గూడుకు టీడీపీ పోరు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 15: ప్రభుత్వం ఇళ్లు.. ఇళ్ళ స్థలాలు ఇస్తామని నమ్మించి ఎప్పటికప్పుడు మోసం చేస్తోందని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన రాజమహేంద్రవరం ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ అన్నారు. పేదల ఇళ్ళ కోసం తెలుగుదేశం ,జనసేన పార్టీల ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేశారు. వెలుగుబంద, బూరుగుపూడి ప్రాంతాల్లో జగనన్నకాలనీలు నివాసయోగ్యం కాదన్నారు. అయినా వైసీపీ ప్రభుత్వం ప్రస్తుతం రిజిస్ట్రేషన్ల పేరుతో నాటకాలు ఆడుతుందన్నారు. కోర్టు అనుమతిచ్చినా ఇప్పటి వరకు బూరుగుపూడిలో ఆవ భూములు ఎందుకు పంపిణీ చేయలేదని ప్రశ్నించారు. ఆ భూములు ప్రజలకు పంపిణీ చేస్తే మొదటికే మోసం వస్తుందని భయపడి కాలయాపన చేస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో గృహాలను శిథిలస్థితికి చేర్చిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అనంతరం కార్పొరేషన్ అదనపు కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, నగర అధ్యక్షుడు రెడ్డిమణి, మజ్జి రాంబాబు, బుడ్డిగ రాధ, ఉప్పులూరి జానకి రామయ్య, మొకమాటి సత్యనారాయణ, కడలి రామకృష్ణ, కరగాని వేణు, మాలే విజయలక్ష్మి, తురకల నిర్మల, అగురుధనరాజు, బేసరి చిన్ని, చాపల చిన్నరాజు తదితరులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయం వద్ద పేదల స్థలాల కోసం ధర్నా చేస్తున్న టీడీపీ నాయకులు

ఎన్నికలకు సన్నద్ధం కండి : డీఐజీ

రేషన్ డీలర్ల కోసమే యాత్ర

8

సంఘం జిల్లా అధ్యక్షుడిగా జామి కృష్ణ ఎన్నిక

షరతుల్లేకుండా సమ్మె కాలం జీతమివ్వాలి

ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

కొవ్వూరు, ఫిబ్రవరి 15: ఎటువంటి షరతులు లేకుండా సమ్మె కాలం జీతాన్ని అందించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కమిషనర్ బి.శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకుడు ఎం.సుందరబాబు మాట్లాడుతూ ప్రభుత్వ హామీ మేరకు సమ్మెకాలంలో నాన్ పీహెచ్ వర్కర్లతోపాటు కొవిడ్, వరదల సమయంలో కొత్తగా తీసుకున్న వారు, క్లాప్ డ్రైవర్లకు, ఎన్ఎంఆర్‌లకు వేతనాలు అందజేయాలన్నారు. పెంచిన వేతనాలు, రూ.21000, 24500లు, రిటైర్డ్‌మెంటు బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియా, మట్టి ఖర్చులు, సంక్షేమ పథకాలు, పర్మినెంట్ కార్మికులకు సరెండర్ లీవులు, జీపీఎఫ్ అకౌంట్లకు సంబంధించిన జీవోలు జారీచేయాలన్నారు. రూ.1000 కానుకలు చెల్లింపులు సత్వరమే చేయాలని, ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీస్కిల్డ్, క్లాప్ డ్రైవర్లకు రూ.18500 జీతం చెల్లింపు చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ కార్మికులు సమ్మె ముగిసి 36 రోజులు గడుస్తున్నా హామీలపై స్పష్టత లేదన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షుడు భూపతి రవీంద్ర, పూజారి వాసు, కళ్యాణి రాజేష్ పాల్గొన్నారు.

18న 'దగాపడ్డ దళితుడా.. రా.. కదలిరా'



కొవ్వూరు, ఫిబ్రవరి 15: నిడదవోలులో ఈ నెల 18న నిర్వహిస్తున్న జగన్ చేతిలో దగాపడ్డ దళితుడా.. రా.. కదలిరా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మహాసేన రాజేష్ అన్నారు. కొవ్వూరులోని టీడీపీ కార్యాలయానికి గురువారం విచ్చేసిన రాజేష్‌ను ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణ సత్కరించారు. రా కదలిరా కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో దళితులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో అర్బన్‌బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, సూర్యదేవర రంజిత్, గెల్లా సురేష్, ఎం.రాజు తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: ఈ నెల 18న నిడదవోలులో జరిగే దగా పడ్డ దళితుడా కార్యక్రమానికి నియోజకవర్గంలోని మాల కులస్థులందరూ రావాలని మాల మహానాడు జిల్లా నాయకుడు బండి శ్యాంబాబు అన్నారు. వైసీపీ రద్దు చేసిన 23 పథకాలు పునరుద్ధరించడానికి మాలలందరిలో చైతన్యం కోసం ప్రచారం చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమం టీడీపీ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు, మహాసేన రాజేష్ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు.

నల్ల బ్యాడ్జీలతో ప్రభుత్వోద్యోగుల నిరసన



నిడదవోలులో నిరసన ప్రదర్శన చేస్తున్న ఉద్యోగులు

నిడదవోలు, ఫిబ్రవరి 15: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వోద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ కె.నందేశ్వరుడు అన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం నిడదవోలులోని నీటి పారుదల శాఖ కార్యాలయం వద్ద ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. నందేశ్వరుడు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకు జేఏసీ ఇచ్చిన ఉద్యమ కార్యాచరణ అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో రాంబాబు, జయంత్, కళ్యాణ్‌కృష్ణ, జయకర్, మాణిక్యాలరావు, కిషోర్ పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



రామ్‌చరణ్, చంద్రశేఖర్

నిడదవోలు, ఫిబ్రవరి 15: మండలంలోని తాడిమళ్ల జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎల్.రామ్‌చరణ్, బి.చంద్రశేఖర్ రాజమహేంద్రవంలో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ నేషనల్ చాంపియన్‌షిప్ సెలక్షన్స్‌లో విశేష ప్రతిభ కనపరచి జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు సూర్యనారాయణ శాస్త్రి తెలిపారు. విద్యార్థులిద్దరూ ఈ నెల 16నుంచి 18వరకు గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతోపాటు వ్యాయామోపాధ్యాయుడు బీఎస్‌వీ ప్రదీప్‌ను సర్పంచ్ బయ్యే రాధారాణి, ఎంపీపీ తిరుమళ్ళ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ కొప్పుల నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

శింగవరంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన

నిడదవోలు, ఫిబ్రవరి 15: మండలంలోని శింగవరంలో గురువారం ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. సుమారు రూ.57 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించనున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పెన్మెత్స చందు, ఎంపీటీసీ పెన్మెత్స నిర్మల, సర్పంచ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పెరవలి: మండలంలోని పిట్టలవేమవరంలో నిర్మించిన వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌ను ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 16: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ కె.నవీన్‌కుమార్ సూచించారు. మండలంలోని తాడిపర్రుతోపాటు పలు గ్రామాల్లోని పోలింగ్‌బూత్‌లను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ర్యాంపులు ఏర్పాటు చేయాలని, విద్యుత్, మంచినీటి సదుపాయం, ఫర్నిచర్ వంటి సదుపాయలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ జేడీవీ ప్రసాద్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకు 'ఆడుదాం ఆంధ్ర'



క్రికెట్ టీమ్‌ను అభినందిస్తున్న మంత్రి తానేటి వనిత

దేవరపల్లి, ఫిబ్రవరి 15: గ్రామీణ ప్రాంతాల యువకుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహించిందని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. దేవరపల్లి సచివాలయం నుంచి క్రీడల్లో పాల్గొన్న మహిళా టీమ్‌కు రాష్ట్రస్థాయిలో క్రికెట్‌లో ద్వితీయ స్థానం లభించింది. దీంతో ఆ టీమ్‌ను మంత్రి వనిత గురువారం అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, వైసీపీ కన్వీనర్ కూచిపూడి సతీష్, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, కుసులూరి సతీష్, ఆచంట అనసూయ, కామిశెట్టి దుర్గారావు, జానకిరామ్ పాల్గొన్నారు.

గోపాలపురం: మండలంలోని గోపవరం గ్రామదేవత శ్రీరేగులమ్మను మంత్రి వనిత దర్శించుకున్నారు. ముందుగా ఆలయం వెలుపల ఉన్న అభయాంజనేయ స్వామి విగ్రహం వద్ద పూజలు చేసి అనంతరం పక్కనే ఉన్న గోశాల వద్దకు వెళ్లి గోవులకు పూజలు చేసి అరటిపండ్లు, శనగల ప్రసాదాన్ని తినిపించారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి గుడూరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు కొట్టడంతో గాయపడ్డ విద్యార్థి

నిడదవోలు, ఫిబ్రవరి 15: అల్లరి చేశాడని విద్యార్థిని ఉపాధ్యాయుడు కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సహచర విద్యార్థుల వివరాల ప్రకారం.. నిడదవోలులోని ఓ మున్సిపల్ పాఠశాలలో గురువారం పదోతరగతి విద్యార్థులు క్లాసులో అల్లరి చేస్తుండడం గమనించి ఓ ఉపాధ్యాయుడు పలువురు విద్యార్థులను దండించాడు. ఈ క్రమంలో కిరణ్‌ను కర్రతో కొట్టడంతో రెండు కళ్ళకు మధ్య ముక్కుపై గాయమైంది. దీంతో ఆ విద్యార్థిని పక్కనే ఉన్న ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు గాయానికి వైద్యం చేసి కుట్లు వేసి పంపించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెరవలి, ఫిబ్రవరి 15: పెరవలి సబ్‌స్టేషన్ పరిధిలోని ఖండవల్లి, మల్లేశ్వరం పీడర్లలో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఈ నెల 16న విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ వీరభద్రరావు తెలిపారు. ఈ సందర్భంగా ఖండవల్లి, అన్నవరప్పాడు, పిట్లవేమవరం, కానూరు గ్రామాల్లో ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1 వరకు, విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు. వ్యవసాయానికి ఉదయం 5నుంచి 8వరకు, మధ్యాహ్నం 1నుంచి 6వరకు సరఫరా ఇస్తామని పేర్కొన్నారు.

యథా కాంట్రాక్టర్.. తథా ఏఈలు

- మున్సిపల్ ఏఈలు కాంట్రాక్టర్ల చేతిలో కీలుబొమ్మలు
- టీడీపీ ఫ్లోర్ లీడర్ సూరపనేని చిన్ని
- మున్సిపాల్టీకి వచ్చాక రూ.15 లక్షలు ఖర్చుచేశా..
- కో ఆప్షన్ సభ్యుడు ఏలూరి వెంకట్
- కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

కొవ్వూరు, ఫిబ్రవరి 15: మున్సిపల్ ఏఈలు కాంట్రాక్టర్ల చేతిలో కీలుబొమ్మలా మారిపోయారని టీడీపీ ఫ్లోర్ లీడర్ సూరపనేని చిన్ని విమర్శించారు. కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం గురువారం చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన నిర్వహించారు. చిన్ని మాట్లాడుతూ నందమూరు రోడ్‌లో చేపట్టిన మేజర్ అవుట్‌లెట్ డ్రైను నిర్మాణ పనులు ఎంతవరకు పెట్టారు? ఎంతవరకు చేస్తున్నారు? కాంట్రాక్టరు ఏం చెబితే ఏఈలు అదే చేస్తున్నారని, నిర్మాణపనులు ముందుకు సాగనివ్వడం లేదన్నారు. డ్రైను నిర్మాణం పూర్తైన ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు వెనక్కి జరపాలన్నారు. కౌన్సిల్ తీర్మానం చేసి ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసులన్నీ కొవ్వూరు బస్టాండ్‌కు వచ్చేలా ఆర్టీసీ అధికారులకు అందించాలన్నారు. 9,10 వార్డులలో డ్వాక్రా సంఘాల సమస్యలను త్వరగా పరిష్కరించాలన్నారు. 7వ వార్డులో, మెయిన్‌రోడ్ కొవ్వూరమ్మ ఆలయం వద్ద డ్రైన్లో పూడిక తీయించాలన్నారు. పిల్లలమర్రి మురళీకృష్ణ మాట్లాడుతూ కేంద్ర నిధులతో చేపట్టిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంపై ప్రదాని మోదీ బొమ్మను వేయాలన్నారు. ఆరోగ్య మందిరానికి రాష్ట్ర ప్రభుత్వ నిధులని కమిషనర్ అనడంపై రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలన్నారు. 15వ వార్డు కౌన్సిలర్ శ్రీనివాస రవీంద్ర మాట్లాడుతూ కాంట్రాక్టర్లకు బిల్లులు పడకపోవడంతో పనులు చేయడానికి ముందుకు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రిడ్జిపేట వాసులకు రాత్రి 10గంటలకు తాగునీరు అందించడంపై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్డు కం రైలు బ్రిడ్జి వద్ద రైల్వే గ్రౌండ్‌లో మున్సిపల్ సిబ్బంది చెత్త వేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కో ఆప్షన్ సభ్యుడు ఏలూరి వెంకట్ మాట్లాడుతూ మున్సిపాల్టీలో ఉన్న బాబ్‌కార్ట్‌తో డ్రైనేజి పూడిక తీతలు ఎందుకు చేపట్టడం లేదన్నారు. తాను మున్సిపాల్టీకి వచ్చిన తరువాత రూ.15 లక్షల వరకు ఖర్చుచేసానని, మున్సిపాల్టీకి ఉపయోగపడను అనుకుంటే రాజీనామా చేస్తానని ఆగ్రహం వ్యక్తం చేశారు. కంఠమణి రమేష్‌బాబు మాట్లాడుతూ పట్టణంలో రూ.55 కోట్లతో ఏఐబీ నిధులతో పైపులైను పనులు చేపట్టారని, మరలా 4వ వార్డు (చైర్‌పర్సన్ వార్డు) క్రిస్టియన్‌పేటలో రూ.12 లక్షలతో పైపులైను పనులు చేపట్టడాన్ని వ్యతిరేకించడంతో ఆ పనులను రద్దు చేస్తున్నట్టు చైర్‌పర్సన్ ప్రకటించారు. కండెల్లి రామారావు మాట్లాడుతూ ఔరంగాబాద్ శ్మశాన వాటికలో ముళ్లపొదలు, ఔరంగాబాద్-వేములూరు రోడ్‌లో మేజర్‌డ్రైను పూడిక తొలగించాలన్నారు. బొండాడ సత్యనారాయణ మాట్లాడుతూ పట్టణంలో అన్ని వార్డుల్లో వీధి దీపాలు వెలగడం లేదని, రాత్రుళ్లు మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మద్దిపట్ల సాయిగీత మాట్లాడుతూ ఆర్‌సీఆర్‌బీ టోల్‌గేట్ నుంచి గోదావరి మాత విగ్రహం వరకు రోడ్డుపై లారీల నుంచి ఇసుక జారిపడి ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇసుక తొలగించాలని గత కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చినా చర్యలు తీసుకోలేదన్నారు. చైర్‌పర్సన్ రత్నకుమారి మాట్లాడుతూ ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు కొవ్వూరు బస్టాండ్‌కు వచ్చేలా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో వైస్‌చైర్మన్లు మన్నె పద్మ, గండ్రోతు అంజలీ, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు, చైర్‌పర్సన్ రత్నకుమారి

టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందించాలి

టీడీపీ, బీజేపీ కౌన్సిలర్ల నిరసన ప్రదర్శన

టిడ్కో గృహాలను తక్షణం లబ్ధిదారులకు అందించాలని టీడీపీ, బీజేపీ కౌన్సిలర్లు నిరసన ప్రదర్శన చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం వద్ద సూరపనేని చిన్న ఆధ్వర్యంలో ఫ్లకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారికి, కమిషనర్ బి.శ్రీకాంత్‌కు వినతిపత్రాలు అందజేశారు. చిన్ని మాట్లాడుతూ డంపింగ్‌యార్డు లేకపోవడంతో ఇంటింటా సేకరించిన చెత్తను రహదారుల పక్కన వేసి తగలబెట్టడంతో హానికర ట్యాక్సిన్‌లు విడుదలై ప్రజలు శ్వాసకోశ ఇబ్బందులతో పాటు క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. ప్రభుత్వం డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించడంలో విఫలమైందన్నారు. ఇంటింటా సేకరించిన చెత్తలో ప్లాస్టిక్‌వ్యర్థాలు వేరుచేయడం, చెత్త తగలబెట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను ఉపయోగించి శాశ్వత డంపింగ్ యార్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, టీడీపీ కౌన్సిలర్లు బొండాడ తసత్యనారాయణ, కండెల్లి రామారావు, రాము, మురుకొండ రమాదేవి, పాలూరి నీలిమ, కిలాని వీరవెంకటలక్ష్మి పాల్గొన్నారు.



మునిసిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న టీడీపీ, బీజేపీ కౌన్సిలర్లు

నాణ్యమైన విత్తనంతో కందలో అధిక దిగుబడులు



కంద పంటను పరిశీలిస్తున్న కేరళ శాస్త్రవేత్తలు

- తిరువనంతపురం కేంద్రీయ దుంప పంటల పరిశోధనా స్థానం డైరెక్టర్ బైజు.. తోగుమ్మిలో కంద పంట పరిశీలన

కొవ్వూరు, ఫిబ్రవరి 15: కందలో అధిక దిగుబడులు సాధించడానికి నాణ్యమైన విత్తనంతో పాటు మేలైన యాజమాన్య పద్ధతులను పాటించాలని కేరళలోని తిరువనంతపురం కేంద్రీయ దుంప పంటల పరిశోధనా స్థానం డైరెక్టర్ డా. బి.బైజు తెలిపారు. గురువారం కొవ్వూరు వైఎస్ఆర్ ఉద్యాన పరిశోధనా స్థానంలోని వివిధ దుంప రకాలను శాస్త్రవేత్తలు నెడుంచెరియన్, డి.జగన్నాథన్, సీటీఆర్ఐ శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. మండలంలోని తోగుమ్మి గ్రామంలో సాగుచేస్తున్న కంద పంటను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలను అందజేశారు. వాతావరణ పరిస్థితులను తట్టుకుని, మంచి దిగుబడి సాధించాలంటే కందలో విత్తన దుంపల ఎంపిక, సమతుల ఎరువుల యజమాన్యం, చీడపీడల యాజమాన్యం పాటించాలన్నారు. ఇతర ప్రాంతాల నుంచి కంద దుంపలను దిగుబడి చేసుకునే సమయంలో జాగ్రత్తలు తీసుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చునన్నారు. అలాగే పంటమార్పిడి, అంతర పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు ఉద్యాన పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు జి.రామానందం, కె.మమత, కె.రవీంద్రకుమార్, సీహెచ్.కిషోర్‌కుమార్, ఎ.స్నేహలతారాణి, ఎం.విశ్వనాథ్, రైతులు పాల్గొన్నారు.

నేడు గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయండి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుందరబాబు

కొవ్వూరు, ఫిబ్రవరి 15: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న నిర్వహించే దేశ వ్యాప్త కార్మికులు గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు అన్నారు. గురువారం కొవ్వూరులో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటు మద్దుకూరి దొరయ్య ఆధ్వర్యంలో బంద్‌పై కరపత్రాలు పంపిణీ చేశారు. సుందరబాబు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, విద్యుత్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అన్నివర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మాణిక్‌రెడ్డి హరిబాబు, జాస్తి శివరామకృష్ణ, నందన్, కొండబాబు, ఆచంట కోటేశ్వరరావు, మునుమురెడ్డి సురేష్, మల్లిన రాధాకృష్ణ పాల్గొన్నారు.

తాళ్లపూడి: తాళ్లపూడి బస్టాండ్ సెంటరులో జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు మాట్లాడుతూ 16న జరిగే గ్రామీణ బంద్‌లో రైతులు, వ్యవసాయ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. వివిధ తరగతుల ప్రజానీక సమస్యలపై కరపత్రాలు పంపిణీ చేశారు. రైసు మిల్లు వర్కర్ల యూనియన్ అధ్యక్షుడు సుంకర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ షెడ్యూల్ పరిశ్రమలు, సంస్థల్లో పనిచేస్తున్న 50 లక్షలకు పైగా కార్మికుల వేతనాలను ప్రభుత్వం సవరించలేదన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు వల్లేపల్లి నరశింహమూర్తి మాట్లాడుతూ ప్రమాదవశాత్తూ చనిపోయిన వారికి వైఎస్ఆర్ బీమా వర్తించలేదని, సంక్షేమ బోర్డు ద్వారా కూడా కార్మికులకు ఆర్థిక సహాయం అందడం లేదన్నారు. కార్యక్రమంలో చోళ్ల సత్యన్నారాయణ, గారపాటి రమణ, జొన్నకూటి జయ, చెరుకూరి ధర్మయ్య, పిల్లి చిల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.



తాళ్లపూడిలో కరపత్రాలను చూపుతున్న రైసుమిల్లు కార్మికులు

రాజధాని ఫైల్స్ సినిమా ప్రదర్శన నిలిపివేత



నల్లజర్లలో పోలీసు, రెవెన్యూ అధికారులతో వాదిస్తున్న మద్దిపాటి

కొవ్వూరు, ఫిబ్రవరి 15 : కొవ్వూరు యువరాజ్‌మాల్‌లో గురువారం రాజధాని ఫైల్స్ సినిమా ప్రదర్శనను పోలీసు, రెవెన్యూ అధికారులు అడ్డుకుని నిలిపివేశారు. కొవ్వూరులోని యువరాజ్‌మాల్ స్క్రీన్2లో రాజధాని ఫైల్స్ సినిమాను ప్రదర్శించారు. పావుగంట ఆట అయిన తరువాత పట్టణ పోలీసులు, రెవెన్యూ సిబ్బంది సినిమాను నిలుపుదల చేసి, ప్రేక్షకులను పంపించి వేశారు. సమాచారం తెలుసుకున్న టీడీపీ నాయకులు థియేటర్ వద్దకు చేరుకుని సినిమా ప్రదర్శన నిలిపివేతపై ప్రశ్నించారు. యాత్ర సినిమాను పోలీసులు, వలంటీర్లు దగ్గరుండి వేయిస్తున్నారని విమర్శించారు. ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు మాట్లాడుతూ సీఎం జగన్ నియంతలా పాలిస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారన్నారు. రాజధాని ప్రాంతంలో రైతులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను సినిమాను తీస్తే ప్రజల వద్దకు వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నారన్నారు. దీనిపై టీడీపీ తరపున న్యాయ పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, సూర్యదేవర రంజిత్, గెల్లా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: నల్లజర్లలో శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్‌లో రాజధాని ఫైల్స్ సినిమా మార్నింగ్ షోను పోలీసులు, రెవెన్యూ అధికారులు నిలిపివేశారు. ఇంతలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకటరాజు చేరుకుని అధికారులతో వాగ్వాదానికి దిగారు. రిట్ పిటీషన్‌పై సినిమా నిలుపుదల చేయడమేమిటని ప్రశ్నించారు. నిర్మాత, డైరెక్టర్‌లకు ఉత్వర్వులు ఇస్తే వారి సూచనల మీద మాత్రమే సినిమా నిలుపుదల చేయాలి తప్ప, షో నిలుపుదల చేసే హక్కు ఎవరికీ లేదన్నారు. వైసీపీ ప్రభుత్వం యాత్ర-2 సినిమాను ఏలా ప్రదర్శించారని ప్రశ్నించారు. అక్కడే ఉండి షో వేయించారు. అయితే ఆయన వెళ్ళిన 10నిమిషాల్లో పోలీసులు, రెవెన్యూ అధికారులు షో నిలిపివేశారు.

అనుమానం.. పెనుభూతమై

- భార్యను హతమార్చి.. భర్త ఆత్మహత్య
- తల్లిదండ్రుల మృతితో అనాథలైన పిల్లలు
- ఉలిక్కి పడ్డ కడియపుసావరం



రక్తపు మడుగులో సత్యశ్రీ మృతదేహం

కడియం, ఫిబ్రవరి 15: భార్యపై అనుమానం.. ఓ కుటుంబాన్ని చిందర వందర చేసింది. భార్యపై అనుమానం పెంచుకున్న భర్త ఆమెను హతమార్చాడు.. ఆపై తానూ పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. క్షణికావేశంలో జరిగిన ఈ ఘటనతో పిల్లలు అనాథలుగా మిగిలారు. కడియం మండలం కడియపుసావరం గ్రామంలోని వడ్డి వీరభద్రరావు కాలనీకి చెందిన దూళ్ళ సూరిబాబు(40)కు, అదే గ్రామానికి చెందిన సత్యశ్రీ(33)కి 16 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఎనిమిదో తరగతి చదువుతున్న కుమారుడు వెంకన్నబాబు, ఐదో తరగతి చదువుతున్న కుమార్తె వైష్ణవిశ్రీ ఉన్నారు. సూరిబాబు కౌలు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరు గతంలో వడ్డి వీరభద్రరావు కాలనీ ఉండేవారు. ఇటీవల పంచాయతీ కార్యాలయం సమీపంలో సత్యశ్రీ తల్లిదండ్రుల ఇంటి వద్ద ఉంటున్నారు. భార్యపై అనుమానం పెంచుకున్న సూరిబాబు గురువారం ఉదయం భార్యతో గొడవపడి క్షణికావేశంలో హతమార్చాడు. దక్షిణ మండల డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, కడియం సీఐ బి.తులసీధర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని సత్యశ్రీ మృతదేహాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం ఆధారంగా వివరాలు సేకరిస్తున్నారు. కాగా బంధువులు, గ్రామస్థులు సంఘటనా స్థలం వద్ద ఉండడంతో సూరిబాబు గురించి ఆలోచించలేదు. అయితే మనస్థాపం చెంది సూరిబాబు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలియడంతో బంధువులు, గ్రామస్థులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సూరిబాబు సాయంత్రం మృతి చెందాడు. భార్యాభర్తల మృతితో పిల్లలిద్దరూ అనాథలుగా మిగిలారు. అమ్మను నాన్న ఎందుకు చంపాడో ? నాన్న ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో? తెలియని ఆ చిన్నారులు అయోమయానికి గురై దిక్కులు చూస్తున్నారు.



రోదిస్తున్న బంధువులు

గ్రాఫ్టింగ్ బ్లేడ్‌తో దాడి

ఈ ఘటనపై కొవ్వూరులో ఉంటున్న సత్యశ్రీ సోదరి సంతోషి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తమ తల్లిదండ్రులకు తాము ఐదుగురు సంతానమని, ఏడాది క్రితం తల్లి చనిపోయిందని తెలిపింది. ఈ ఏడాది సంక్రాంతి పండుగకు సత్యశ్రీ ఎవరితోనో ఫోనులో మాట్లాడుతున్నట్టు సూరిబాబు తమ అక్కాచెల్లెళ్లకు చెప్పాడని, దీంతో పెద్దల సమక్షంలో వారికి నచ్చజెప్పినట్టు చెప్పింది. సత్యశ్రీని బావ పలు మార్లు వేధించాడని ఫిర్యాదులో పేర్కొంది. ఈనెల 14న సావరం గ్రామ పెద్దలు వచ్చి అక్కబావలకు సర్దిచెప్పారని తెలిపింది. ఈనెల 15వ తేదీ ఉదయం 6గంటల సమయంలో తమ పుట్టింటిలో అద్దెకు ఉండే వాళ్ల సమాచారం ఇవ్వడంతో వచ్చామని, అప్పటికే సత్యశ్రీ(33) రక్తపు మడుగులో ఉందని, పీకపై లోతుగా తెగిన గాయం ఉందని, మొక్కల గ్రాఫ్టింగ్‌కు వాడే బ్లేడ్‌తో దాడిచేశాడని సంతోషి ఫిర్యాదులో పేర్కొంది.

ఎన్నికలకు సన్నద్ధం కావాలి

- రిమార్కు లేకుండా విధులు నిర్వర్తించాలి
- ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్ కుమార్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు అన్నివిధాలా సన్నద్ధం కావాలని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఆదేశించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరగడానికి అందరూ సమష్టిగా పూర్తి సమన్వయంతో పని చేయాలని.. సర్వీసులో రిమార్కు లేకుండా విధులు నిర్వర్తించాలన్నారు. తూర్పు గోదావరి జిల్లా పోలీసు కార్యాలయం (డీపీవో)లో గురువారం ఆయన వార్షిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. వివిధ విభాగాల వార్షిక పనితీరు, జిల్లాలోని పరిస్థితులను ఆయనకు ఎస్పీ జగదీశ్ వివరించారు. అనంతరం డీపీవో ప్రాంగణంలో ఉన్న ఆయుధాగారం, డాగ్ స్క్వాడ్, బీడీ టీం, ఎంటీవో, ఆర్ఐ స్టోర్స్‌ని డీఐజీ సందర్శించారు. మినిస్టీరియల్, డీసీఆర్బీ, డీటీఆర్బీ, ఎస్బీ తదితర విభాగాలు సమర్పించిన వార్షిక పనితీరు నివేదికలను పరిశీలించారు. కమాండ్ కంట్రోల్‌లోని సీసీ కెమెరాల లైవ్ స్ట్రీమింగ్‌ని వీక్షించారు. ఎన్నికల దృష్ట్యా డీపీవో నుంచి సకాలంలో ఎన్నికలకు సంబంధించిన సమాచారం రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయానికి, ఉన్నతాధికారులకు చేరే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఆ మేరకు పోలీస్ స్టేషను స్థాయి నుంచి సమాచార సేకరణ, క్రోడీకరణపై సిబ్బందికి అవగాహన కల్పించాలని ఆదేశించారు. అవాంఛనీయ సంఘటనలు జరిగిన సమయంలో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు లాఠీడ్రిల్, వెపన్ డ్రిల్, మాబ్ డ్రిల్‌ని సాధన చేయాలన్నారు. మద్యం, గంజాయి, సారా అక్రమ రవాణా నియంత్రించాలన్నారు. సిబ్బందికి జిల్లా స్థాయిలో పరిష్కారం కాకుండా ఉన్న సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తొలుతగా ఏఆర్ అడిషనల్ ఎస్పీ చెంచిరెడ్డి ఆధ్వర్యంలో రిజర్వు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పరేడ్ కమాండర్‌గా సాయుధ రిజర్వు పోలీసు సిబ్బంది చేసిన కవాతును డీఐజీ వీక్షించి గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(శాంతి భద్రతలు) పి.అనీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్స్ సమస్యల పరిష్కారానికే భరోసా యాత్ర

- రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలా మాధవరావు
- జిల్లా నూతన కమిటీ ఎన్నిక.. అధ్యక్షుడిగా కృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 15: రేషన్ డీలర్స్ సమస్యల పరిష్కారానికే భరోసా యాత్ర చేస్తున్నామని రేషన్ డీలర్స్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలామాధవరావు అన్నారు. భరోసా యాత్ర రాజమహేంద్రవరం చేరుకున్న సందర్భంగా హోటల్ జగదీశ్వరిలో గురువారం సాయంత్రం జరిగిన రేషన్ డీలర్స్ సమావేశంలో మాట్లాడారు. ఆహార భద్రత చట్టం పీడీఎస్ కంట్రోల్ ఆర్డర్ ప్రకారం నిబంధనలను అనుసరించి రేషన్ డీలర్స్ ద్వారా మాత్రమే రేషన్ సరుకులు పంపిణీ చేయాలని, తెలంగాణ మాదిరి డీలర్స్‌కి గౌరవ వేతనం కల్పించాలన్నారు.రేషన్ డీలర్స్, ఎండీయూ ఆపరేటర్లకు చెల్లించాల్సిన బకాయిలు ఈనెల 25వ తేదీలోపు చెల్లించాలన్నారు. రేషన్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా జామి కృష్ణ, గౌరవాధ్యక్షుడిగా బి.నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేవీవీ.రమణ, ఉపాధ్యక్షుడిగా మంగం రామారావు (పెరవలి), వెంకటేశ్వరరావు (ఉండ్రాజవరం), ప్రధాన కార్యదర్శిగా వై.వెంకటరత్నం, కార్యదర్శిగా కె.కామేశ్వరరావు (కడియం), ఆర్గనైజింగ్ సెక్రటరీగా రంగా (నిడదవోలు) ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడపా రమణ, రాష్ట్ర కోశాధికారి రాజులపాటి గంగాధర్ గౌడ్, తూర్పు గోదావరి, కాకినాడ జిల్లా అధ్యక్షుడు జామి కృష్ణ, పల్లయ్య, గొర్రెల సత్తిబాబు, అన్ని మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రామాలయ విగ్రహ ప్రతిష్ఠ పూజలు

చాగల్లు, ఫిబ్రవరి 15: మండలంలోని దారవరంలో శ్రీకోదండ రామాలయ విగ్రహ పునః ప్రతిష్ఠ త్రయాహ్నిక దీక్షా మహోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యహవాచనం, దీక్షాధారణ, గోపూజ, యాగశాల ప్రవేశం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. ఆదివారం ఉదయం పలు పూజా కార్యక్రమాలు, సాయంత్రం హోమాలు, సోమవారం విగ్రహ, శిఖర ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, పూర్ణాహుతి, శాంతి కల్యాణం, జరుగుతాయని తెలిపారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	ఈగల్
వై.స్క్రీన్2	రాజధాని ఫైల్స్
దేవిశ్రీ(గాయత్రి)	హనుమాన్
అనన్య	అంబాజీపేట బ్యారేజీ బ్యాండ్

నిడదవోలు

వీ మ్యాక్స్	ఊరి పేరు భైరవ కోన
రాధాకృష్ణ	హనుమాన్
శ్రీగణపతి	ఈగల్

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	సలార్
శ్రీనివాస	సలార్